మంగళవారం
11-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 50
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

నేడు బీహార్ తుది దశ పోలింగ్

పట్నా: బీహార్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమయింది. మొదటి దశలో 121 స్థానాల్లో పోలింగ్ జరిగింది. మిగిలిన 122 స్థానాలకు మంగళవారం రెండో దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. 1,302 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. దాదాపు 3.70 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1.75 కోట్ల మంది మహిళలు. 45 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నితీశ్ ప్రభుత్వంలోని అనేక మంది మంత్రులు తమ అదృష్టాన్ని

- మిగతా 2 లో

ఎర్రకోట వద్ద భారీ పేలుడు

10 మంది మృతి... 24 మందికి తీవ్రగాయాలు

- ఉలిక్కిపడ్డ దేశ రాజధాని
- ఆగి ఉన్న రెండు కార్లలో వరుస పేలుళ్లు
- పేలుడు ధాటికి అనేక వాహనాలు ధ్వంసం
- మెట్రో స్టేషన్ గేట్-1 పార్కింగ్‌లో ఘటన
- ఢిల్లీ సహా అనేక నగరాల్లో హైఅలర్ట్
- దర్యాప్తునకు హోంమంత్రి అమిత్‌షా ఆదేశం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో భారీ పేలుళ్లు తీవ్ర కలకలం రేపాయి. ఎర్రకోట సమీపంలో నిలిపి ఉంచిన రెండు కార్లలో వరుస పేలుళ్లు సంభవించగా... పెద్ద ఎత్తు మంటలు ఎగిసిపడి పక్కనున్న వాహనాలకు వ్యాపించాయి. ఈ ఘటనలో 10 మంది మృతి చెందారు. పేలుడు ధాటికి ధాటికి మృతదేహాలు ఛిద్రమ య్యాయి. 24మంది తీవ్రంగా గాయపడగా... వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఈ ఘటనలో డెలివరీ బాయ్ ఒకరు సజీవదహనం అయినట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో చారిత్రక ఎర్రకోట సమీపంలో ఉన్న మెట్రో స్టేషన్ గేట్ నెంబర్ 1 వద్ద ఒక కారు ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ప్రమాదం జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తల దాచుకునేందుకు

- మిగతా 2 లో

భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం

శ్రీనగర్: ఉగ్రనిరోధక చర్యల్లో జమ్మూకశ్మీర్ పోలీసులు భారీ విజయం సాధించారు. హర్యానా పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు చేశారు. నిషేధిత జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్‌వత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇందులో ముగ్గురు వైద్యులు ఉన్నారు. పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం 'అక్టోబరు 19న శ్రీనగర్‌లోని బన్‌పొరా నౌగామ్ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకుని జైషే మహమ్మద్ పోస్టర్లు వెలిశాయి. ఈ వ్యవహారం పై ఉపా చట్టంతోపాటు ఆయా చట్టాల కింద కేసు నమోదు చేశాం. దర్యాప్తులో భాగంగా ఉగ్రవాద

- మిగతా 2 లో

భారత్‌పై హఫీజ్ దాడులు?

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ సయీద్ నేతృత్వంలోని పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు భారతదేశంపై దాడులకు కుట్ర పన్నుతున్నారని, ఇందుకు బంగ్లాదేశ్‌ను కొత్త వేదికగా ఎంచుకున్నారని నిఘా వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన వీడియో రికార్డింగ్ నిఘావర్గాలకు అందిందని 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' తన కథనంలో పేర్కొంది. అక్టోబర్ 30న పాకిస్థాన్‌లోని ఖైర్‌పూర్ తమేవాలిలో జరిగిన ర్యాలీలో సీనియర్ ఎల్ఈటీ కమాండర్ సైఫుల్లా సైఫ్ ఈ

- మిగతా 2 లో

సింగరేణి సుస్థిర భవిష్యత్‌కు

కలిసికట్టుగా పనిచేద్దాం

- క్వార్టర్ల నిర్మాణానికి రూ.300 కోట్లు
- అత్యాధునిక వైద్యసేవలకు క్యాథ్ ల్యాబ్
- కార్మికుల పిల్లలకు జాతీయస్థాయి విద్యాబోధన
- సీఎండీ బలరామ్

విశాలాంధ్ర- హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ దిశానిర్దేశంలో అంతర్జాతీయ సంస్థగా ఎదుగుతున్న సింగరేణికి సుస్థిర భవిష్యత్ అందించడానికి ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కోరారు. పని సంస్కృతిని మెరుగుపరుస్తూ ఎనిమిది గంటల పూర్తి సమయాన్ని కంపెనీ అభివృద్ధి కోసం వినియోగించేలా యాజమాన్యం తీసుకుంటున్న చర్యలకు గుర్తింపు కార్మిక సంఘం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో జరిగిన 39వ నిర్మాణాత్మక సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు రంగంలో పోటీని తట్టుకునేందుకు ధరలను తగ్గించామని, ఈ నేపథ్యంలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం అనివార్యమని, అప్పుడే సంక్షేమాన్ని కొనసాగించడానికి, ఉపాధి కల్పనకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరు అవుతున్న కార్మికులు విధులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలని, తద్వారా క్రమశిక్షణను పెంచడం సాధ్యమవుతుందన్నారు. రక్షణ, నాణ్యత పెంపుదలకు మరింత కృషి జరగాలన్నారు. సింగరేణి సంస్థ రానున్న

- మిగతా 2 లో

ప్రముఖ కవి, రచయిత

అందెశ్రీ కన్నుమూత

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ సోమవారం ఉదయం కన్నుమూశారు. హైదరాబాద్ లాలాగూడలోని తన నివాసంలో ఆదివారం రాత్రి ఆయన అస్వస్థతకు గురి కాగా... కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ను గాంధీ ఆస్పత్రికి తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అందెశ్రీ భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి ఇంటికి తరలించారు. అనంతరం స్థానిక జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. అందెశ్రీ మరణంతో సాహితీ లోకం కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. అందెశ్రీ 1961, జూలై 18న సిద్దిపేట జిల్లా రేబర్తిలో జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. గొర్రెల కాపరిగా జీవనం ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ కీలక పాత్ర

- మిగతా 2 లో

రోడ్డు ప్రమాదాలపై 'సుప్రీం' ఆందోళన

న్యూఢిల్లీ: జాతీయ రహదారులలో రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అనుమతి లేని దాబాలు, రోడ్డు నిర్వహణ సరిగ్గా లేకపోవడం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లోని జాతీయ రహదారులపై ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ రెండు రాష్ట్రాల జాతీయ రహదారుల ప్రమాద ఘటనలపై నివేదిక సమర్పించాలని ఎన్‌హెచ్ఏఐ, కేంద్ర రవాణా శాఖకు ఆదేశాలు జారీ చేసింది. రహదారులపై అనుమతి లేకుండా ఎన్ని దాబాలు ఉన్నాయో సర్వే చేయాలని, రోడ్డు స్థితిగతులపైన నివేదిక ఇవ్వాలని కోరింది.

జూబ్లీహిల్స్ పోలింగ్ నేడు

139 ప్రాంతాల్లో 407 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర - హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యా యి. సోమవారం ఉదయం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి, బొటానికల్ గార్డెన్ లో ఎన్నికల సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి అప్పగించారు. పోలింగ్ మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరగనుంది. గత ఎన్నికలతో పోలిస్తే గంట సమయం అదనంగా ఉంది. నియోజకవర్గ

- మిగతా 2 లో

రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయం

విశాలాంధ్ర - హైదరాబాద్: స్వగృహ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి చేసిన లే అవుట్లలో నివాస భవనాల నిర్మాణానికి అనువైన ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. నగరానికి సమీపంలో ఉన్న తొర్రూర్, బహుదూర్ పల్లి, కుర్మల్ గూడ ప్రాంతాల్లోని 163 ఓపెన్ ప్లాట్లను ఈ నెల 17, 18 తేదీల్లో బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. అవుటర్ రింగ్ రోడ్ కు అతి చేరువలోని తొర్రూర్ ప్రాం తంలో 200 నుంచి 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న125 ప్లాట్లు, కుర్మల్ గూడ లో 200-300 చదరపు గజాల విస్తీర్ణంలోని 25 ప్లాట్లు, బహదూర్ పల్లిలో 200-1000 గజాల్లోని 13 ప్లాట్లను విక్రయానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇప్పటికే మౌలిక వసతుల కల్పన కూడా పూర్తి అయింది. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15 వ తేదీలోగా

- మిగతా 2 లో

ప్రగతిశీల ఉద్యమాలకు తీరని లోటు

అందెశ్రీకి సీపీఐ ఘన నివాళి

విశాలాంధ్ర- హైదరాబాద్: కవి, నంది అవార్డు గ్రహీత అందెశ్రీ మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, ఆయన మృతి కళారంగానికి తీరని లోటని సీపీఐ ప్రముఖులు పేర్కొన్నారు. తన పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేశారన్నారు. అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గేయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గేయంగా ప్రకటించిం దన్నారు. అది కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తు చేశారు. మనిషి గురించి ఆయన రాసిన పాట కళ్లకు కట్టినట్టు చూపించారని వారు గుర్తు చేశారు. పముఖ విప్లవకవి, వాగ్గేయకారుడు, తెలంగాణ వేగుచుక్క రాలిపోవడం ప్రగతి శీల ఉద్యమాలకు తీరని లోటన్నారు. ప్రజాకళలు వర్ధిల్లినంతకాలం ఆయన పేరు అజరామరంగా నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట్ రెడ్డి, కె.రామకృష్ణ, పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవైన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమావత్ అంజయ్య నాయక్, మందా పవన్, రేగుంట చంద్రశేఖర్ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మన భాగస్వామ్యం అక్కర్లేదంటావా? గురూ!

'పెట్టుబడి' పేరుతో

కష్టజీవుల పొట్ట కొడతారా?

- విశాఖలో వారంపాటు చిరువ్యాపారాలు బంద్
- అధికారుల అత్యుత్సాహం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖలో ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న బిజినెస్ సమ్మిట్ వీధి వ్యాపారుల బతుకు పోరాటంపై సమ్మెటలా పడింది. పెట్టుబడుదారుల సదస్సు పేరిట విశాఖపట్నంలో చిరు వ్యాపారులకు వారం రోజులు వ్యాపారాలు బంద్ చేయాలని అధికారులు హుకుం జారీ చేశారు. గడిచిన ఆదివారం నుంచి మళ్లీ ఆదివారం వరకు తాము చెప్పిన రహదారుల్లో షాపులు తెరవరాదని, తెలిస్తే కఠిన చర్యలు తప్పవని, శాశ్వతంగా షాపులు లేకుండా పట్టుకు పోతామని పోలీసులు, జీవీఎంసీ అధికారులు చిరు వ్యాపారులపై తమ ప్రతాపాన్ని చూపారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో పెట్టుబడుదారుల సదస్సు నిర్వహించనున్న క్రమంలో అధికార యంత్రాంగం నగరాన్ని సుందరీకరించే పనుల్లో నిమగ్నమైంది. ఇందుకోసం విశాఖలో దాదాపు లక్ష మంది వీధి వ్యాపారుల జీవనభృతిని వారం రోజులపాటు బంద్ చేయడమేనా అభివృద్ధి అని చిరు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఈ సదస్సు

- మిగతా 2 లో

విద్యా రంగానికి గట్టి పునాదులు వేసిన మేధావి

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నేడు

విశాలాంధ్ర - హైదరాబాద్: స్వతంత్ర భారత దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా పని చేసి, విద్యా రంగానికి గట్టి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్ కే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మంగళవారం ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం) సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణతో పాటు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగాభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని సీఎం కొనియాడారు. ఆజాద్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేశామని, యంగ్

- మిగతా 2 లో

మాలీలో జీహాదీల ఉన్మాదం

యువతి దారుణ హత్య

బాంకో: పశ్చిమాఫ్రికా దేశమైన మాలీలో జిహాదీ ఉగ్రవాదులు దారుణానికి ఒడిగట్టారు. సోషల్ మీడియా వేదిక టిక్‌టాక్‌లో వీడియోలు పోస్ట్ చేస్తూ పాపులర్ అయిన ఒక యువతిని కిడ్నాప్ చేసి, బహిరంగంగా కాల్చి చంపారు. సైన్యానికి గూఢచారిగా పనిచేస్తోందన్న ఆరోపణలతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఉత్తర మాలిలోని టింబక్టు ప్రాంతంలోని టోంకా నగరానికి చెందిన మరియమ్ సిస్సే అనే యువతి టిక్‌టాక్‌లో స్థానిక విశేషాలపై వీడియోలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమెకు సుమారు 90 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. అయితే, గురువారం కొందరు జిహాదీలు ఆమెను అపహరించారు. మాలి సైన్యంకు తమ కదలికల గురించి ఆమె సమాచారం చేరవేస్తోందని ఆరోపించారు. ఆ మరుసటి రోజే అంటే శుక్రవారం మరియమ్‌ను ఒక మోటార్‌బైక్‌పై టోంకా నగరంలోని ఇండిపెండెన్స్ స్క్వేర్‌కు తీసుకొచ్చారు. అక్కడి జనసమూహం చూస్తుండగానే ఆమెను తుపాకీతో కాల్చి చంపారు. "వారు నా సోదరిని చంపేటప్పుడు నేను ఆ గుంపులోనే ఉన్నాను" అని ఆమె సోదరుడు ఆవేదనతో వెల్లడించారు. ఈ ఘటనను ఓ భద్రతా అధికారి ధ్రువీకరించారు. "మాలి సైన్యం కోసం జిహాదీలను వీడియో తీస్తోందని ఆరోపిస్తూ మరియమ్ సిస్సేను బహిరంగంగా హత్య చేశారు. ఇది అత్యంత అనాగరికమైన చర్య" అని ఆయన పేర్కొన్నారు. స్థానిక అధికారులు కూడా ఈ హత్యను "నీచమైన చర్య"గా అభివర్ణిస్తూ తీవ్రంగా ఖండించారు. 2012 నుంచి మాలి దేశం జిహాదీ ఉగ్రవాదంతో పోరాడుతోంది. ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న సైనిక ప్రభుత్వం ఈ తిరుగుబాటును అణచివేయడంలో తీవ్రంగా శ్రమిస్తోంది.

అమెరికాలో షట్‌డౌన్ ముగింపునకు డెమోక్రాట్ల మద్దతు

వాషింగ్టన్: అమెరికాలో 40 రోజుల పాటు నిలిచిపోయిన ప్రభుత్వ కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ షట్‌డౌన్ తొలగిపోనుంది. దీనికి అనుకూలంగా ఆ దేశ సెనెట్‌లో ఓటింగ్ జరగ్గా కొందరు డెమోక్రాట్లు కూడా అనుకూలంగా ఓటు వేశారు. అమెరికా ప్రభుత్వానికి నిధుల విడుదలకు సంబంధించిన బిల్లులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కాంగ్రెస్ మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మొదలైన షట్‌డౌన్ ఆదివారానికి 40వ రోజుకు చేరుకుంది. దేశవ్యాప్తంగా విమాన సేవలకు అంతరాయం కలగడంతో ఈ ప్రతిష్టంభనను తొలగించడానికి సెనెటర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా షట్‌డౌన్ ముగించేందుకు మార్గం సుగమం అయింది. ట్రంప్, రిపబ్లికన్లు ప్రతిపాదించిన ఓ ఒప్పందానికి కొందరు డెమోక్రాట్లు సానుకూలత వ్యక్తపర్చారు. ఈ దిశగా టెక్సాస్ సెనెటర్ జాన్ కార్నిన్ ఓటుతో తీర్మానానికి అనుకూలంగా 60 ఓట్లు వచ్చాయి. సెనెట్‌లో రిపబ్లికన్ సభ్యుల సంఖ్య 53 కాగా, డెమోక్రాట్ల సంఖ్య 45, ఇద్దరు స్వతంత్ర సభ్యులున్నారు. అక్కడ బిల్లు ఆమోదం పొందాలంటే 60 ఓట్లు రావాల్సి ఉండగా... ఇప్పుడు ఎనిమిది మంది వరకు డెమోక్రాట్లు మద్దతు ఇచ్చారు.ట్రంప్ హయాంలో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడం ఇది మూడోసారి. 1981 నుంచి అక్కడి ప్రభుత్వం 15 సార్లు మూతపడింది.

షాంఘై-ఢిల్లీ విమాన సర్వీసు ప్రారంభం

బీజింగ్: చైనా ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఆది వారం షాంఘై-ఢిల్లీ విమాన సర్వీసును ప్రారంభించింది. 95 శాతం ఆక్యుపెన్సీతో ఈ విమానం నడిపింది. ఐదేళ్ల విరామం తర్వాత భారత్‌కు నేరుగా విమాన సర్వీసులను నడుపుతున్న చైనా తొలి విమానయాన సంస్థగా ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ నిలిచింది. ఎంయూ 563 విమానం.. 248 మంది ప్రయాణికులతో షాంఘైలోని పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరింది. కాగా భారత్‌కు చెందిన ఇండిగో సంస్థ సోమవారం నుంచి ఢిల్లీ-గువాంగ్‌ఝౌకు విమాన సర్వీసులను ప్రారంభించింది. షాంఘై-ఢిల్లీ మార్గం అత్యంత కీలకమైనది. ఈ నూతన విమాన సర్వీసువల్ల రెండు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక, సాంస్కృతిక సంబంధ రాకపోకలు పెరుగుతాయని చైనా అధికారిక 'గ్లోబల్ టైమ్స్' పత్రిక పేర్కొంది. కోవిడ్-19 మహమ్మారి కారణంగా 2020లో రెండు దేశాల మధ్య విమాన సర్వీసులు నిలిచిపోయాయి. ఆ తర్వాత కరోనా ప్రభావం తగ్గినా తూర్పు లద్దాఖ్‌లో ఉద్రిక్తతలవల్ల విమాన సర్వీసుల పునరుద్ధరణ సాధ్యం కాలేదు. ఈ క్రమంలో నవంబర్ 26న రెండు దేశాల మధ్య విమాన రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. నాడు కోల్‌కతా నుంచి బయల్దేరిన ఇండిగో విమానం గువాంగ్‌ఝౌలో దిగింది.

ఎర్రకోట వద్ద భారీ పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నించారు. పేలుడు సంభవించిన వెంటనే మంటలు పక్కనే ఉన్న మరో నాలుగు వాహనాలకు వ్యాపించాయి. మొత్తం నాలుగు వాహనాలు దగ్ధమయ్యాయి. ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులతో పాటు అగ్నిమాపక దళాలు అక్కడకు చేరుకున్నాయి. ఏడు ఫైర్ ఇంజిన్లతో మంటలను ఆర్పివేయడం ప్రారంభించగా... ఆ తర్వాత మరికొన్ని అగ్నిమాపక వాహనాలు అక్కడికి చేరుకున్నాయి. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. "ఆసుపత్రికి 15 మంది క్షతగాత్రులను తీసుకువచ్చారు. వారిలో 8 మంది మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఒక వ్యక్తి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది" అని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. కాగా ఘటనా స్థలి వద్ద పరిస్థితిని చూస్తే చూస్తే ఉద్దేశపూర్వకంగా చేసిన దాడి లాగానే కనిపిస్తోందని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఢిల్లీ పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. ఘటనాస్థలిలో పరిస్థితి భయానకంగా మారింది. కార్లు, ఆటోలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. సమీపంలోని షాపులు, భవనాలు కూడా ధ్వంసం అయ్యాయి. ప్రతి సోమవారం ఢిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు కావడంతో ప్రమాదం తీవ్రత, ప్రాణ నష్టం కాస్త తగ్గిందని తెలుస్తోంది.

హైగ్రేడ్ ఎక్స్‌ప్లోజివ్ ఉపయోగించినట్లు అనుమానం

ఎర్రకోట మెట్రో స్టేషన్ పార్కింగ్ కారులో హైగ్రేడ్ ఎక్స్‌ప్లోజివ్ ఉపయోగించినట్లు అనుమానిస్తున్నారు. పేలుడు ఘటన నేపథ్యంలో ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులతో కేంద్రహోంమంత్రి అమిత్‌షా మాట్లాడారు. పేలుడు ఘటనపై దర్యాప్తుకు ఆదేశించారు. కాగా, పేలుడు ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించారు. ముంబై, హైదరాబాద్ సహా అన్ని ప్రధాన నగరాల్లో ఈ హైఅలర్ట్ ప్రకటించారు. భద్రత కట్టుదిట్టం చేశారు. ఇక ఎన్ఎస్‌జి, ఎన్ఐఏ బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించాయి. ఎర్రకోట సహా కీలక ప్రాంతాలకు అదనపు బలగాలను తరలిస్తున్నారు. భారీ ఎత్తున తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సహా క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకున్నాయి. ఎర్రకోట, చాందినీచౌక్ వెళ్లే మార్గాలను పోలీసులు మూసివేశారు.

ఆగిన వాహనంలో పేలుడు?

ఎర్రకోట వద్ద సాయంత్రం 6.52 గంటలకు పేలుడు జరిగిందని ఢిల్లీ పోలీస్ కమిషనర్ తెలిపారు. నెమ్మదిగా వచ్చిన వాహనం రెడ్‌లైట్ దగ్గర ఆగగా... ఆ హనంలో పేలుడు జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒక అనుమానితుడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. కారులో ఉంచిన పేలుడు పదార్థాలను దూరం నుంచి ఎవరైనా రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

భావజాలం కలిగిన విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌తో కూడిన ఓ ఉగ్రవ్యవస్థ వెలుగు చూసింది. ఈ బృందానికి పాకిస్థాన్, ఇతర దేశాల నుంచి పనిచేస్తున్న హ్యాండ్లర్లతో సంబంధాలున్నాయి. సామా జిక, ధార్మిక కార్యక్రమాల ముసుగులో అవసరమైన నిధులు సేకరించారు. వ్యక్తుల్లో తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించి ఉగ్రసంస్థల్లో చేర్పించడం, లాజిస్టిక్స్ ఏర్పాటు, ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు ఐఈడీల తయారీకి అవసరమైన పదార్థాల సేకరణలో పాల్గొన్నట్లు గుర్తించాం. ఈ కార్యకలాపాల సమన్వయం కోసం నిందితులు ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్లను ఉపయోగించారు' అని పోలీసు ప్రతినిధి వెల్లడించారు. అరెస్టైన వైద్యుల్లో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంకు చెందిన డా.ఆదిల్, పుల్వామాకు చెందిన డా.ముజమ్మిల్ అహ్మద్, లక్నోకు చెందిన డా.షాహీన్ ఉన్నారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో డా.ముజమ్మిల్ అహ్మద్ అద్దె నివాసంలో పోలీసులు భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇతడు అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో బోధకుడిగా పనిచేస్తున్నాడు. శ్రీనగర్‌లో జైషే మహమ్మద్ పోస్టర్లు వేసిన కేసులోనూ వాంటెడ్‌గా ఉన్నాడు. ఇతడిని అరెస్టు చేసినట్లు అంతకుముందు ఫరీదాబాద్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. మరోవైపు షాహీన్ కారులో ఓ ఏకే-47 రైఫిల్ లభ్యమైంది. 'ఈ కేసు దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్‌లోని ఆయా ప్రాంతాలతోపాటు హర్యానాలోని ఫరీదాబాద్, ఉత్తరప్రదేశ్‌లోని సహారాన్‌పూర్‌లో స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించాం. ఈ క్రమంలోనే మరికొంతమంది నిందితుల పాత్ర బయటపడింది. వారినీ అరెస్టు చేస్తాం. ఇప్పటివరకు ఓ చైనీస్ స్టార్, బెరెట్టా పిస్టల్స్, ఏకే 56, ఏకే క్రింకోవ్ రైఫిళ్లు, 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలు స్వాధీనం చేసుకున్నాం. నిధులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోంది' అని జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి తెలిపారు.

కష్టజీవుల పొట్ట కొడతారా?

(మొదటిపేజీ తరువాయి)

కోసం ప్రధాన రహదారుల్లో పండ్లు , కూరగాయలు, పకోడీ, కొబ్బరి బొండాలు, మెకానిక్ దుకాణాలు, పంక్చర్ షాపులు, వివిధ రకాల దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు అమ్మే షాపులు, చిన్న చిన్న టిఫిన్ సెంట్లు, పండ్ల రసాల దుకాణాలతో పాటు తోపుడు బండ్లపై చిరు వ్యాపారం చేసుకుంటూ రోడ్లపైనే జీవిస్తున్న లక్ష మంది కి పైగా చిరు వ్యాపారులకు ఆదాయం లేకుండా చేయడాన్ని ప్రతి ఒక్కరూ తప్పుబడుతున్నారు. ఇప్పటికే బీచ్ రోడ్డు తో పాటు, అనేక ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న దుకాణాలను పూర్తిగా మూయించేశారు. ఇటీవల దసరాకు ముందు విశాఖలో ఆపరేషన్ లంగ్స్3 పేరిట ఓ లక్ష దుకాణాలను రోడ్లపై నుంచి తొలగించేసిన జీవీఎంసీ అధికారులు ...తాజాగా బిజినెస్ సమ్మిట్ పేరిట రహదారిలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా సరే...16వ తేదీ వరకు షాపులు తెరవరాదంటూ ట్రాఫిక్ పోలీసులతో కలిసి తమ షాపులను ప్రధాన రహదారుల్లో ఉండకుండా తొలగించారని బాధిత వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడుల పేరుతో తమ జీవన ఉపాధిని దెబ్బతీయడం అన్యాయమని ఆవేదన చెందుతున్నారు. నగరంలో రోడ్డుపైనే వ్యాపారం చేసుకుంటూ రోజువారి చిరు ఆదాయంతో పూట గడుపుకొ స్తున్న వీధి వ్యాపారులను తరచూ ఈవెంట్ల పేరిట వేధించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ వీధివిక్రయ దారుల ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు మండిపడ్డారు. సూట్ కేసు కంపెనీల ప్రతినిధులు సూట్లేసుకొని విశాఖ వస్తే రోడ్లపై వీధి వ్యాపారాలు కనబడకూడదా అంటూ ప్రశ్నించారు. ఇదేమి పెట్టుబడుదారుల సదస్సు... తమ పెట్టుబడిని , చిరు వ్యాపారాలను దెబ్బతీసే సదస్సులు ఎందుకంటూ చిరు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. కేవలం పెట్టుబడు దారుల సదస్సుకు వచ్చే అధికారులు, వ్యాపారవేత్తలు ప్రయాణించే రహదారులు మాత్రమే సుందరంగా తీర్చిదిద్దుతు న్నారని...పాత సిటీ తో పాటు నగర శివారు ప్రాంతాల్లో ఎలాంటి రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు చేపట్టడం లేదని... ఎక్కడ మురుగునీరు అక్కడే తేలియాడుతోందని...ఎక్కడబడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని విశాఖ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గళమెత్తిన ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో తలపెట్టిన బస్సు యాత్ర నేడు అనంతపురం జిల్లాలో ముగియనుంది. ఈ నెల 22న ఇచ్ఛాపురంలో ప్రారంభమైన బస్సు యాత్ర 12వ తేదీన హిందూపురంలో ముగియనుంది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జుల వలరాజు, బందెల నాసర్‌జీ నేతృత్వంలో రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్న ప్రధాన డిమాండ్‌తో బస్సు యాత్ర కొనసాగిస్తున్నారు. మొదటి రోజు నుంచి వేలాది మంది విద్యార్థులతో సభలు, సదస్సులు నిర్వహిస్తూ... చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానాలను విద్యార్థులకు వివరిస్తూ వారిని చైతన్యవంతులను చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారంలోకి రాకముందు యువగళం పాదయాత్ర సమయంలో విద్యార్థులతో పెద్ద ఎత్తున సభ ఏర్పాటు చేసి... అధికారంలోకి వస్తే విద్యా రంగ సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి 18 నెలలవుతున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసపూరిత విధానాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రైవేటీకరణ చేయబోమని హామీ ఇచ్చి... నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో అడ్డగోలుగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని, ప్రతిభ విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను దూరం చేస్తున్నారని ఆయా సభల్లో యువతకు ఏఐఎస్ఎఫ్ నేతలు వివరిస్తున్నారు.

సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో స్వాగతం: వలరాజు, నాసర్‌జీ

రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు మొత్తం సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయని, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జుల వలరాజు, బందెల నాసర్ జీ తెలిపారు. విద్యార్థులకు నిద్రించడానికి కనీసం బెడ్లు ఈ ప్రభుత్వం అందించలేని దుస్థితిలో ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీలు సరిపోవట్లేదని వార్డెన్లు తమకు వివరించారన్నారు. రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా సర్టిఫికెట్లు చేతిలో లేక నిరుద్యోగులుగా 10 లక్షల మంది పైగా విద్యార్థులు రోడ్లపై తిరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిస్థితి అధ్వానంగా మారిందని, 3,480 ప్రొఫెసర్ పోస్టులు భర్తీ కాలేదని విమర్శించారు. విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు లేక విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపడం లేదని అన్నారు. జీవో నంబరు-77 అమలుతో ప్రైవేట్, ఎయిడెడ్ పీజీ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించకపోవడం వలన వేలాది మంది విద్యార్థులు పీజీ విద్యకు దూరమైపోతున్నారని అన్నారు. మరోవైపు, కేవలం రాజకీయ పార్టీ నాయకుల బిడ్డలే వారసత్వ రాజకీయ నాయకులుగా చలామణి అవుతున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయ కేంద్రాల్లో విద్యార్థి నాయకుల నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేకపోతున్నారని, రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ బస్సు యాత్ర నవంబరు 12న వేలాది మంది విద్యార్థులతో అనంతపురంలో ముగింపు సభ ఉండబోతుందని... జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు.

అందెశ్రీ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

పోషించారు. ఉద్యమ పాటలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గీతంగా గుర్తించింది. అందెశ్రీకి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' అనే గీతంతో ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 2006లో గంగ సినిమాకు అందెశ్రీకి నంది పురస్కారం లభించింది. ఆయనకు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి పురస్కారం అందించింది. ఆశు కవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట. 2006లో గంగ సినిమాకు ఆయనకు నంది పురస్కారం లభించింది. 2014లో అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్ వరించింది. 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం అందుకున్నారు. 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం లభించింది. అందెశ్రీ లోక్‌నాయక్ పురస్కారాన్ని అందుకున్నారు.

సాంస్కృతిక, మేధో సంపత్తికి తీరని లోటు: మోదీ

అందెశ్రీ మృతికి ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబసభ్యులు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అందెశ్రీ మరణం సాంస్కృతిక, మేధో ప్రపంచంలో తీరని లోటు అని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

నేల కూలిన సాహితీ శిఖరం: రేవంత్

అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం... రాష్ట్ర సాధనలో 'జయ జయహే తెలంగాణ' గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తు చేశారు. అందె శ్రీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

దిగ్భ్రాంతి కలిగించింది: చంద్రబాబు

అందెశ్రీ మృతి వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు అని పేర్కొన్నారు. అందెశ్రీ మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

స్పీకర్, మంత్రుల సంతాపం

అందెశ్రీ మృతి పట్ల స్పీకర్ ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు.

కేసీఆర్, కేటీఆర్ దిగ్భ్రాంతి

అందెశ్రీ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన సాంస్కృతిక ఉద్యమంలో అందెశ్రీ పాల్గొన్నారని గుర్తుచేశారు. తన పాటలతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. అందెశ్రీ మృతిపట్ల భారత రాష్ట్ర సమితి నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు.

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నేడు

అందెశ్రీకి పోలీసు లాంఛనాలతో మంగళవారం అంత్యక్రియలు జరపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఘట్కేసర్ ఎన్.ఎఫ్.సి నగర్‌లో అందెశ్రీ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అంతిమ యాత్రలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు.

భారత్‌పై హఫీజ్ దాడులు?

(మొదటిపేజీ తరువాయి)

విషయాన్ని వెల్లడించాడు. ఆ వీడియోలో 'హఫీజ్ సయీద్ ఖాళీగా కూర్చోలేదు. అతను బంగ్లాదేశ్ మార్గంలో భారతదేశంపై దాడి చేయడానికి సిద్ధమవుతున్నాడు' అని సైఫుల్లా సైఫ్ స్పష్టంగా చెప్పాడు. లష్కర్ ఎ తోయిబా సభ్యులు ఇప్పటికే బంగ్లాదేశ్‌లో చురుకుగా ఉన్నారని, భారతదేశానికి (ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిగా) సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కాగా సయీద్ 'జిహాద్' నెపంతో బంగ్లాదేశ్ యువతకు ఉగ్రవాద శిక్షణ అందించేందుకు ఆ దేశానికి సైఫుల్లా సైఫ్‌ను పంపాడు. ఈ శిక్షణ కార్యక్రమానికి పిల్లలు హాజరుకావడం విశేషం. ఒక వీడియోలో సైఫ్ పాకిస్థాన్ సైన్యాన్ని ప్రశంసించాడు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత వచ్చిన మార్పులను ప్రస్తావిస్తూ ఇప్పుడు అమెరికా మనతో ఉందని, బంగ్లాదేశ్ కూడా మళ్లీ పాకిస్థాన్‌కు దగ్గరవుతోందని వ్యాఖ్యానించాడు. ఈ వాదనలు కార్యక్రమానికి హాజరైన కార్యకర్తల్లో ధైర్యాన్ని పెంచడానికి ఉద్దేశించినవిగా కనిపిస్తున్నాయి. కాగా బంగ్లాదేశ్ నుండి జరుగుతున్న చొరబాట్లపై నిఘాను భారత్ తీవ్రతరం చేసింది.

టెక్నో-కల్చరల్ ఫెస్ట్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

విశాలాంధ్ర - హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ-నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్, టెక్నో-కల్చరల్ ఫెస్టివల్ - కల్చరల్ సావరినిటీ త్రూ సినిమా" అనే విభిన్న సాంస్కృతిక-సినిమాటోగ్రఫీ ఉత్సవం నిర్వహణకు రూ.55 లక్షల నిధులను మంజూరు చేసిందని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో ఈ నెలలో హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్స్ మరియు హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమానికి కోమటిరెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ "తెలంగాణను దేశంలోని కళ, సంస్కృతి, సినిమాటోగ్రఫీ రంగాల కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ ఫెస్టివల్ ద్వారా ఈశాన్య రాష్ట్రాలతో సాంస్కృతిక, సృజనాత్మక బంధాలు మరింత బలపడతాయి" అన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

(మొదటిపెజీ తరువాయి)

రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహించేలా విస్తరణ ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగుతున్నట్లు సీఎండీ తెలిపారు. బొగ్గు రంగానికే పరిమితమైన సంస్థను ఐదు వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి చేసేలా తీర్చిదిద్దేందుకు వీలుగా సింగరేణి గ్రీన్ ఎనర్జీ , విశ్వవ్యాప్తంగా కీలక ఖనిజ అన్వేషణ, మైనింగ్‌కు సింగరేణి గ్లోబల్ కంపెనీలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 40 వేల మంది ఉద్యోగులు, సంస్థపై ఆధారపడిన 30 వేల మంది కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్ దృష్ట్యా కొత్త బొగ్గు గనులను వేలంలో దక్కించుకోవడానికి కృషి చేస్తున్నామని, తద్వారా సింగరేణికి మరో వందేళ్ల భవిష్యత్ ఉంటుందన్నారు. ఉద్యోగులకు విశాలమైన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్లకు పైగా వెచ్చించి గోదావరిఖని, శ్రీరాంపూర్, మణుగూరు, కొత్తగూడెం, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో వెయ్యి క్వార్టర్ల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య సేవలు అందించడానికి గోదావరిఖనిలో క్యాథ్ ల్యాబ్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు కోసం చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఉద్యోగుల పిల్లలకు జాతీయ స్థాయి విద్యా బోధనను అందించేందుకు ఇప్పటికే రామగుండం-2 ఏరియాలో సీబీఎస్ఈ స్కూల్‌ను ప్రారంభించామని, ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయండి: కూనంనేని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... సింగరేణిని అంతర్జాతీయ కంపెనీగా తీర్చిదిద్దడానికి సీఎండీ బలరామ్ తీసుకుంటున్న చొరవను ప్రత్యేకంగా అభినందించారు. సింగరేణిని కాపాడటానికి తమ యూనియన్ తరపున ఎన్నో త్యాగాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చాలని, కొత్తగూడెంలో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరారు. విశ్రాంత కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలన్నారు. సింగరేణి అధ్వర్యంలో థర్మల్ పవర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య పలు సమస్యలను యాజ మాన్యం దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సీఎండీ ...నిబంధనల మేరకు సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని, ఆర్థిక పరమైనవాటిపై కమిటీలు వేసి చర్యలు తీసుకుంటామన్నారు. డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పొట్రు స్వాగత ఉపన్యాసం చేశారు. డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పీఅండ్‌పీ), ఎం.తిరుమల రావు (ఈ అండ్ ఎం) , జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం కవితా నాయుడు, ఇతర జీఎంలు పాల్గొన్నారు.

నేడు బీహార్ తుది దశ పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షించుకోనున్నారు. పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామర్హి, మధుబని, సుపౌల్, అరేరియా, కిషన్‌గంజ్ తదితర జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. వీటిలో చాలావరకు సీమాంచల్ ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడ ముస్లిం జనాభా అధికం. అత్యధికంగా హిసువా అసెంబ్లీ నియోజకవర్గంలో 3.67 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. లౌరియా, చన్‌పటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలీ, బన్‌మన్‌ఖీ స్థానాల్లో అత్యధికంగా 22 మంది చొప్పున పోటీ పడుతున్నారు. అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. నాలుగు లక్షలకు పైగా సిబ్బంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు. ఇప్పటికే సిబ్బంది పోలింగ్‌కు అవసరమైన సామాగ్రితో సంబంధిత బూత్‌లకు చేరుకున్నారు. ఈ ఎన్నికల్లో మహాఘట్బంధన్, ఎన్డీఏ కూటమి మధ్యనే ప్రధాన పోటీ నెలకొని ఉంది. వీరితో పాటు కొత్తగా ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ, లాలూ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ నేతృత్వంలోని జన్‌శక్తి జనతాదళ్ పార్టీ బరిలో నిలిచాయి. మంత్రులు రేణుదేవీ, నీరజ్ కుమార్ సింగ్, లేశీ సింగ్, శీలా మండల్, జమా ఖాన్, మాజీ ఉప ముఖ్యమంత్రి తార్‌కిశోర్ ప్రసాద్ (బీజేపీ), కాంగ్రెస్ బిహార్ అధ్యక్షుడు రాజేశ్ కుమార్ తమ తమ స్థానాల నుంచి బరిలో దిగారు. ఎన్డీఏ కూటమిలోని హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) కు కేటాయించిన ఆరు సీట్లు ఇదే దశలో ఉన్నాయి. కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన ఈ పార్టీ నుంచి నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు మరోసారి పోటీ చేశారు. కాగా ఈ నెల 6న 121 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించిన తొలిదశ ఎన్నికల్లో 65 శాతానికి పైగా పోలింగ్ నమోదయింది.

ప్రగతిశీల ఉద్యమాలకు తీరని లోటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ తదితర ప్రముఖులు... ప్రజా కవిగా అందెశ్రీ ప్రజాకళలకు, ఉద్యమాలకు చేసిన సేవలు మరుపురానివని, ప్రజా కళాకారులకు, కవులకు మరణం ఉండదంటూ ఆయన మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కాగా, లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో అందెశ్రీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జూబ్లీహిల్స్ పోలింగ్ నేడు

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో మొత్తం 4 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు 58మంది బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ హఠాన్మరణంతో ఖాళీ అయింది. జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ అధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నా యి. 2లక్షల 8వేల 561 మంది పురుషులు, 1లక్ష 92వేల 779మంది మహిళలు, 25మంది ఇతరులు ఉన్నారు. నియోజకవర్గంలో 18మంది సర్వీసు ఓటర్లు, 123 మంది విదేశీ ఓటర్లు ఉన్నారు. మొత్తం 1,908 మంది దివ్యాంగులు, 6,859 మంది మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు సరాసరి 986 ఓటర్లు ఉన్నారు.

విద్యా రంగానికి గట్టి పునాదులు వేసిన మేధావి

(మొదటిపేజీ తరువాయి)

ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని సీఎం తెలిపారు. జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఖిలాఫత్ ఉద్యమములో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడారని, జాతీయోద్యమములో హిందూ ముస్లిం ఐక్యతను కోరుకొని దేశ విభజనను వ్యతిరేకించాడని సీఎం గుర్తు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం మైనారిటీలకు గొంతుకగా నిలిచారని అన్నారు.

రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయం

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకోవాలని మేనేజింగ్ డైరెక్టర్ సూచించారు. పెద్ద అంబర్ పేట్ లోని అవికా కన్వెన్షన్ లో 17,18 తేదీల్లో తొర్రూర్ ప్రాంతంలోని 125 ప్లాట్లకు, 18న బహదూర్ పల్లి, కుర్మల్ గూడల్లోని ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎండీ గౌతమ్ పేర్కొన్నారు. కాగా, ఓపెన్ ప్లాట్ల విక్రయాలపై అనేక మంది ఆసక్తి కనపరుస్తున్నారు. తొర్రూర్ లే అవుట్ లో ఉన్న885 ప్లాట్లలో ఇప్పటివరకు 517 ప్లాట్లను విక్రయించారు. మిగిలిన వాటిలో ప్రస్తుతం 125 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు.

షాదీ ముబారఖ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : ఖానాపూర్ నియోజకవర్గంలో సోమవారం రూ.25 లక్షల 77 వేల షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే. ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో షాది ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయడానికి, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, హాజరై ముందుగా ఖానాపూర్‌లోని డబల్‌బెడ్ రూమ్‌లలో అవకతవకాలు జరిగాయి అనర్హులకు ఇండ్లు అందించారు. చాలాసార్లు ప్రజలు రోడ్డుకి రాస్తారోకోలు ర్యాలీలుగా చేసినప్పటికీ వాటి దృశ్య, గత కొన్ని రోజుల క్రితం అనర్హులను తొలగించడానికి, అధికారులు రీయంక్వైరీ చేసి అనర్హులను గుర్తించి వెళ్ళవలసిందిగా నోటీసులు అంటించారు . తదుపరి పకడ్బందీ చర్యలు తీసుకొని ఎవరికైతే డబుల్ బెడ్ రూమ్‌లు రాణి నిరుపేదలు ఉన్నారో, వారిని గుర్తించి వారికి అందివ్వడం జరుగుతుందని అన్నారు. అనంతరం చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమానకాంత్, ఎమ్మార్వో సుజాత రెడ్డి, ఆర్ఐ నగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దయానంద్, ఎంపీ ఓరత్నాకర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు (84)వచ్చాయని వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత విభాగాలకు పంపడం జరిగిందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈఓ పురుషోత్తం, డిఆర్డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, వ్యవసాయ శాఖ అధికారులు విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సర్వేల్యాండ్ అధికారి నరసింహమూర్తి, హార్టికల్చర్ అధికారి జి.మరియన్న, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, డిడి గ్రౌండ్ వాటర్ వేముల సురేష్, డి ఎం సివిల్ సప్లై కృష్ణవేణి, వెల్ఫేర్ అధికారిని సబిత, జీఎం ఇండస్ట్రీస్ శ్రీమన్నారాయణరెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరామ్ నాయక్, మెప్మా పిడి విజయ, ఎంప్లాయిమెంట్ అధికారిని రజిత, కలెక్టరేట్ పర్యవేక్షకులు మదన్ గోపాల్, వివిధ మండలాల డిప్యూటీ తహసీల్దారులు, మున్సిపల్ మేనేజర్లు, సంబంధిత అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చే ప్రతి దరఖాస్తును అధిక ప్రాధాన్యతతో పరిశీలించి, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కే. సీతారామారావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల అర్జీలను స్వీకరించారు. అధికారులు రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, తేమ శాతం 17 వచ్చిన వెంటనే కాంటా వేసి లారీల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి శాఖలో ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తుల కోసం ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసి, ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా నమోదు చేయాలని, దాని స్థితిని లబ్ధిదారులకు తెలియజేయాలని ఆయన సూచించారు.ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. సంబంధిత అధికారులకు పంపి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వివి అప్పారావు, డి ఎఫ్ ఓ సతీష్ కుమార్, డి పి ఓ యాదగిరి, డి ఇ ఓ అశోక్, సి పీ ఓ కిషన్, డి డబ్ల్యూ ఓ నరసింహారావు, సంక్షేమ అధికారులు శంకర్, శ్రీనివాస్, నరసింహారావు, దయానందరాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, జిల్లా క్రీడా అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ డ్రైవర్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర తొర్రూరు : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై నిరంతరం సంచరిస్తున్న గ్రానైట్ లారీల డ్రైవర్లకు తొర్రూరు ఎస్సై గొల్లమూడి ఉపేందర్ సోమవారం తొర్రూరు పట్టణంలోని దుబ్బ తండ భారత్ పెట్రోల్ బంక్‌వద్ద కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్సై ఉపేందర్ మాట్లాడుతూ, గ్రానైట్ లారీ డ్రైవర్లు అధిక బరువుతో వాహనాలు నడపకూడదని, వాహనాల స్పీడును నియంత్రించి నెమ్మదిగా, జాగ్రత్తగా నడపాలని సూచించారు. వాహనం నడిపే ముందు తగినంత విశ్రాంతి తీసుకోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. అదేవిధంగా గ్రానైట్ లారీల అనుమతిపత్రాలు, రవాణా చలాన్లు తనిఖీ చేసి, అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని డ్రైవర్లను ఆదేశించారు. అనంతరం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఎక్కువ గుంతలమయంతో ప్రమాదాలు సంభవిస్తుండడంతో పోలీస్ అధికారులు స్పందించి జాతీయ రహదారిపై పడిన గుంతలను దగ్గరుండి తొర్రూరు ఎస్ఐ గొల్లమూడి ఉపేందర్ పూర్చించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజు, పరమేశ్, బావ్ సింగ్, మధు, అలాగే లారీ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా సింగరేణి క్వాటర్స్ కౌన్సిలింగ్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా సి.ఈ.ఆర్ క్లబ్ లో సింగరేణి ఎస్.సి.డబ్ల్యూ.ఎ ఉద్యోగులకు క్వాటర్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ కు మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియలకు 107 క్వాటర్స్ ప్రకటించగా,87 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియార్టీ ప్రకారం 18 మంది ఎస్.సి.డబ్ల్యూ.ఎ మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియ ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్స్ ను కేటాయించడం జరిగిందని, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వంశీ, మేనేజ్మెంట్ ట్రైని సివిల్ రాజు కార్మికులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు నిబంధనలు ఎత్తివేయాలి

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలని, అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలి అని, రబీ సీజన్ సన్న ధాన్యం బోనస్ రూ.63 కోట్లు విడుదల చేయాలి అని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు జిల్లా కలెక్టరేట్ ఎదుట శు క్రవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ సిసిఐ నిబంధనలు పత్తి రైతులను తీవ్ర ఇక్కట్లుకు గురిచేస్తున్నాయి అని అన్నారు, కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్ తోపాటు, తేమశాతం 8 నుంచి 12 శాతం ఉండాలనే నిబంధన, ఎకరాకు ఏడు క్వింటాళ్ల కొనుగోలు నిబంధన తక్షణమే ఎత్తివేయాలి అని డిమాండ్ చేశారు. అధిక వర్షాలతో పత్తి రైతు దెబ్బతిన్నందున నాణ్యత నిబంధనను సడలించి పత్తి పంట ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ 8110 కొనుగోలు చేయాలి అని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఎకరాకు పదివేల రూపాయలు పరిహారం అందజేస్తామని ప్రకటించిన ఖమ్మం జిల్లాలో వ్యవసాయ అధికారులు పంటల సర్వే చేయడం లేదని అన్నారు. పంట నిలువుపై ఉండి పూర్తిగా దెబ్బతింటేనే నమోదు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించిందని అధికారులు చెబుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కనీసం పంటల పరిశీలన చేయడం లేదని అన్నారు . పెసలు మార్కెట్ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో మద్దతు ధరలో సగం కూడా రైతులు పొందలేకపోతున్నారని అన్నారు, ధాన్యం బోనస్ 63 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ మాట్లాడారు అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి కి సమస్యలు తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాతా భాస్కర్ రావు, ఎస్ కె మీరా, చింత నిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, నల్లమోతు మెహన్ రావు,బోడేపూడి వీరభద్రంతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

దివికేగిన అక్షర జ్వాల అందెశ్రీ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కారేపల్లి: అక్షర జ్వాలలతో రాసిన కవితల కాంతి ఆరిపోదని ప్రజల హృదయాల్లో డాక్టర్ అందెశ్రీ రాసిన పదాలు ఎప్పుడూ వెలుగుతూనే ఉంటాయని ఆయన కవిత్వం జనం ఊపిరి అని ప్రముఖ కవి డాక్టర్ అందెశ్రీ మరణ వార్త తనను కలిసివేసిందని వైరా మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ భానోతు చంద్రావతి అన్నారు. సోమవారం వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ భానోతు చంద్రావతి కారేపల్లిలో మాట్లాడుతూ కవిగా కీర్తి ప్రతిష్టలు గాంచిన అందెశ్రీ స్వరం నిశ్శబ్దమైనా, ప్రతిధ్వని శాశ్వతమని పేర్కొన్నారు. తెలుగు సాహితీ ఆకాశంలో ఒక తార మసిలిపోయిందని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని వేడుకున్నట్లు తెలిపారు.

వ్యతిరేక వార్తలపై నివేదికలు ఇవ్వండి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : వివిధ పత్రికల్లో ప్రచురితమవుతున్న వ్యతిరేక వార్తలకు సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదికలను ఈ వారాంతంలోగా తనకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. 83 వార్తలుకు సంబంధించి నివేదిక ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుతో సహాపత్తి మొక్కజొన్న తదితర పంటల కొనుగోలు విషయంలో ఎటువంటి లోపాలు జరగకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి జిల్లా సమీక్షించారు. ప్రజావాణి కి సంబంధించి వివిధ శాఖలకు సంబంధించి, ప్రజల నుండి 201 దరఖాస్తులకు పరిష్కారం పెండింగ్ లో ఉన్నాయని, యుద్ధప్రాతిపదికన వచ్చే శనివారం లోగా దరఖాస్తుల పరిష్కారం చేయాలని కలెక్టర్ అన్నారు. మంత్రుల నుండి ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి వివిధ శాఖల నుండి 152 దరఖాస్తులకు గాను, 21 దరఖాస్తులకు చర్యలు , తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమీక్ష లో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో ఎన్. సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర, దమ్మపేట : మండలం పరిధి మల్కారం పంచాయతీ కార్యాలయం సమీపంలో ద్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ మల్కారం పరిధిలోని రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం ఈ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండల పరిధిలో రైతులకు అన్ని విధాల సహకరించేందుకు తమ కమిటీ సిద్ధంగా ఉందన్నారు. కొనుగోలు సంబంధిత ఏవైనా సమస్యలపై శాఖ అధికారుల దృష్టికి తీసుకోని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ద్వాక్రా మహిళలు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ మార్గం ఆదర్శనీయం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : స్వాతంత్ర్య సమర యోధులు, దేశ విద్యావిధానాన్ని మలుపు తిప్పిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ముస్లిం లకే కాకా దేశ ప్రజలకు ఆదర్శప్రాయులని రాష్ట్ర మైనారిటీ నాయకులు కొత్తగూడెం ఉర్దూఘర్ చైర్మన్ డాక్టర్ నయీమ్ ఖురేషి అన్నారు. అబుల్ కలాం జయంతిని పురస్కరించుకొని సోమవారం ఖురేషి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన విద్యావ్యవస్థకు చేసిన కృషిని గుర్తు చేసుకోవడానికి 2008లో కేంద్రప్రభుత్వం ఆయన జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. స్వాతంత్ర భారతదేశంలో ఆయన తొలి విద్యాశాఖ మంత్రి అన్నారు. అప్పటి జాతీయ కాంగ్రెస్ పార్టీలోస్ఫూర్తిదాయకమైన కీలక పదవులు నిర్వహించాలని వివరించారు. రచయిత, దురదృష్టి గల ఆయన 1888 ఏడాది నవంబర్ 11వ తేదీన సౌదీ అరేబియా లోని మక్కా ప్రాంతంలో జన్మించారని తెలిపారు. భారత దేశంలో స్థిరపడిన ఆయన కుటుంబం దేశ ప్రజలకు అనేక సేవలు అందించినట్లు వివరించారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలు నెరవేరేనా : బీసీ సంఘం

విశాలాంధ్ర-నేరేడు చర్ల : బీసీ అభ్యున్నతికి పాటుపడతామని గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో నేటి ముఖ్యమంత్రి నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి సరిగ్గా నేటికీ రెండేళ్లు పూర్తయిందని కానీ అమలకు నోచుకో పోవడం బాధాకరవని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో జ్యోతిరావుపూలే చిత్రపటం ముందు బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నల్ల కండువాలు వేసుకొని బీసీ సంఘాల ప్రతినిధులు నిరసన తెలియజేసిన సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ బీసీల అభివృద్ధి కొరకు 21 హామీలు ఇచ్చి ఉన్నారని ముఖ్యంగా స్థానిక సంస్థల్లో, విద్యలో, ఉద్యోగంలో, ఉపాధిలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ యిచ్చారన్నారు. ఈ హామీ అమలు కావాలంటే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లును షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చాల్సి ఉండగా బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందని అందువల్ల అఖిలపక్షాలను ప్రధాని వద్దకు తీసుకెళ్లడంలో ముఖ్యమంత్రి చొరవ చేయకపోవడం బాధాకరమన్నారు.అలాగే ప్రతి మండల కేంద్రంలో 50 దుకాణాలతో కూడిన షాపింగ్ మాల్స్ నిర్మాణం చేసి రైతు బజార్ మాదిరిగా బీసీ బజార్లు ఏర్పాటు చేసి చేతివృత్తుల వారికి ఉచితంగా దుకాణాలు కేటాయిస్తామన్న వాగ్దానం కూడా అమలు కాలేదని బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం 20000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఉన్నారని మొదటి సంవత్సరం కేవలం 9,200 కోట్లు మాత్రమే కేటాయించి అందులో కూడా రెండు వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తక్షణమే రెండు సంవత్సరాలకు సంబంధించి 40,000 కోట్ల రూపాయలు బీసీలకు బడ్జెట్ కేటాయించి బీసీ యువతకు స్వయం ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని,,రాజీవ్ వికాసం పేరుతో ఇంటర్వ్యూ నిర్వహించి ఆ పథకాన్ని అటకెక్కించారని వారు విమర్శించారు. బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్ కుమార్ బీసీ జేఏసీ కన్వీనర్ బొడ్డుపల్లి సుందరయ్య లు మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని అందుకు కావలసిన అన్ని రకాల ప్రయత్నాలు బలంగా చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి కేంద్రం మెడలు వంచి బిసి బిల్లు షెడ్యూల్ తొమ్మిదిలో చర్చేందుకు ముఖ్యమంత్రి అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేయాలనివారు విజ్ఞప్తి చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమరాజు వెంకట్ బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ అమరారపు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పెద్దపంగ సురేష్ బాబు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడపల్లి అరుణ్ కుమార్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిల్లల మర్రి పుల్లారావు నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాపర్తి శ్రీనివాస్, తక్కెళ్ళ నాగార్జున బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ చంద్రయ్య గౌడ్ మురళి సత్యనారాయణ రాంప్రసాద్ ఎర్రమాద సైదులు నామ రవి చిట్టిప్రోలు శ్రీను షేక్ నబులు పాల్గొన్నారు

ప్రజావాణి ధరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె స్వయంగా హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీపై అధికారులు వెంటనే స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి, సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు ఫీల్డ్ విజిట్లు నిరంతరం నిర్వహిస్తూ, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు వ్యవస్థ పై పర్యవేక్షణ కఠినంగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు ను నిరంతరం పర్యేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

అందెశ్రీకి నివాళి

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: ప్రముఖ కవి అందెశ్రీ హఠాన్మరణంపొందగా... జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో ఆయన చిటపటానికి నివాళులు అర్పించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.కొండల్ రెడ్డి, తెలంగాణ ఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షులు దొంతి నరేందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ మేడి మధుసూదన్ రావు . సోమవారం మెదక్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అందెశ్రీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి, జర్నలిస్టులు నాగరాజు, , మానవ హక్కుల వేదిక నేత షేక్ అహ్మద్, డీబీఎఫ్ నేతలు రామస్వామి, దయాసాగర్, నాయకులు ఇక్బల్ పాషా, మనోహర్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు. సాహితీ రంగంతోపాటు తెలంగాణకు తీరని లోటన్నారు.

అందెశ్రీ మృతి బాధాకరం : నామా

విశాలాంధ్ర- ఖమ్మం : ప్రముఖ కవి, రచయిత డా. అందెశ్రీ అకాల మరణం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అందెశ్రీ లేనిలోటు సాహిత్య ప్రపంచానికి తీరనిలోటు అని తెలిపారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలను ఉత్తేజపరిచిన అనేక గేయాలు, కవితలు ఆయన కలం నుంచి వెలువడి చరిత్రలో నిలిచిపోయాయని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన రచనలు, భావజాలం, సందేశాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. డా. అందెశ్రీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ మండలం కోంటూర్ పెద్ద చెరువులో 100 % ప్రభుత్వ రాయితీపై చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...రూ 35వేల కోట్లు రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నామన్నారు. మత్స్యకారుల సంక్షేమంలో భాగంగా వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. జిల్లాలోని 309 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో 16,820 సభ్యులకు జీవనోపాదితో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. మెదక్ నియోజకవర్గంలో 98 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో గల 6762 సభ్యులకు జీవనోపాధి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు ఎం. రామకృష్ణ, ఎల్ల బోయిన ప్రశాంత్, జి. దేవేందర్, అంజయ్య, నాయకులు శ్రీనివాస్ చౌదరి, అరుణ తదితరులున్నారు. అనంతరం రాజ్పల్లి, మల్కాపూర్ తండా, కోటూర్ లో విస్తృతంగా పర్యటించారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో : జిల్లా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేలా ప్రజావాణి కార్యక్రమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ రకాల ఫిర్యాదులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. అనంతరం ఆమె సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, “ఫిర్యాదులు అందిన వెంటనే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి. అనవసరంగా పెండింగ్‌లో ఉంచొద్దు. పరిష్కారం కాని ఫిర్యాదు ఉంటే ఫిర్యాదుదారునికి స్పష్టమైన వివరణ ఇవ్వాలి. అలాగే, పరిష్కారమైన ఫిర్యాదుల వివరాలను కలెక్టర్ కార్యాలయానికి తప్పనిసరిగా తెలియజేయాలి,” అని అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 94 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిలో 31 ఫిర్యాదులు జిల్లా అధికారులకు, 63 ఫిర్యాదులు రెవిన్యూ శాఖకు సంబంధించినవిగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఇన్చార్జ్ డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొని ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-వనపర్తి : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 50 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్ లతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ త్రాగునీటి సమస్య లు, సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోస్టర్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ఏటూరునాగారం జెడ్పి హెచ్ ఎస్ పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ములుగు జిల్లా అధ్యక్షులు కొయ్యడ మల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం చెకుముకి జిల్లా కన్వీనర్ పల్లె నాగరాజు తో కలిసి 'చెకుముకి సైన్స్ సంబురాలు -2025' పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కొయ్యడ మల్లయ్య విద్యార్థులనుద్దేశించి, మాట్లాడుతూ విద్యార్థుల విద్యా, విజ్ఞానం, వికాసం కోసం సైన్స్ ఉపయోగ పడుతుందని, భవిష్యత్తు అంత సైన్స్‌పైనే ఆధారపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరు సైంటిఫిక్ టెంపర్ అలవారుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె రాజన్న, శ్రావణ్ కుమార్, సుమన్, రాజు, సూర్య, రజిత పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన మంచిర్యాల జిల్లా, క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాంనగర్ టీచర్స్ కాలనీకి చెందిన వేణుగోపాల్ (57), సోమవారం క్యాతనపల్లి ఎక్స్ రోడ్ వద్ద మంచిర్యాల నుండి మందమర్రి వైపు వెళ్ళే జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఎంఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్ళే క్రమంలో సమీపంలోని పెట్రోల్‌బంకు వద్దకు పెట్రోల్ కోసం టూవీలర్‌పై వెళ్లగా హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో ఒక్కసారిగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం తన అన్న క్రింద పడిపోయిన వెంటనే 108కి సమాచారం అందించానని వారు ఘటన స్థలానికి ఆలస్యంగా చేరుకున్నారని, అంబులెన్స్ సిబ్బంది పరీక్షించిన అనంతరం గుండెపోటుతో చనిపోయాడు అని తెలిపారని, మృతునికి భార్య, ఇద్దరు కుమారులు వున్నారన్నారు.

యోగాతో ఆరోగ్యం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: జీవితంలో ప్రతి ఒక్కరు యోగ ఆచరించి ఆరోగ్యవంతులుగా ఉండాలని సింగరేణి ఆర్జీవన్ జీఎం లలిత్ కుమార్ అన్నారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు సోమవారం శ్రీ షణ్ముక శివ చంద్ర హైదరాబాద్ యోగా గురువుచే ప్రాచీన యోగా దినచర్య,మిషన్ హెల్తి సింగరేణి అనే కార్యక్రమం గోదావరిఖనికి ఆర్‌సిఓఏ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లడుతూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు సమాజంలో ముఖ్యముగా గుడ్ ఫ్యామిలీ, గుడ్ వర్కర్ గా యోగా వలన కలుగు ఫలితాల గురించి వివరిస్తూ యోగా అలర్చుకొని ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు యోగ ఆచరించి ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రామములో సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, క్వాలిటీ జీఎం సుజోయా ముజుందార్, ఎఐటియుసి,బ్రాంచ్ సెక్రటరి అరెల్లి పోషం, అధికారులు చంద్రశేఖర్, క్రాంతి కుమార్,రవీందర్ రెడ్డి,హన్మంత రావు,లేడీస్ క్లబ్ సెక్రటరి శిరీష,సేవా జాయింట్ సెక్రటరి రజిత,డాక్టర్ కారం పద్మ,డాక్టర్ డిప్యూటి మెడికల్ ఆఫీసర్ ప్రసన్న,అధిక సంఖ్యలో ఉద్యోగులు సేవా సభ్యులు పారిశ్రామిక ప్రాంత వాసులు పాల్గొన్నారు.

కౌలు రైతులు పత్తి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోండి

విశాలాంధ్ర -ఖమ్మం : కౌలు రైతులు తాము పండించిన పత్తి పంటను అలవాసుల వరకు దళారీలకు విక్రయించుకోకుండా సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. అయితే కౌలు రైతులు తమ పేర్లు ఆయా మండలాల పరిధిలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేయించి పత్తి విక్రయించుకోవాలని ఆయన సూచించారు.

సంపాదకీయం

ఎన్నికల కమిషన్ నడవడికే బీహార్‌లో అసలు ప్రశ్న

బీహార్ శాసన సభ తొలిదశ పోలింగ్ పూర్తి అయిన తరవాత నితీశ్‌కుమార్ పరిస్థితి ఏమిటి, అక్కడ తేజస్వీయాదవ్ నాయకత్వం లోని మహాఘట్బంధన్ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఏమేరకు ఉన్నాయి అన్న చర్చ జరుగుతుండగానే బీజేపీ చేస్తున్న కుటిల యత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం రెండో దశ పోలింగ్ జరగవలసి ఉంది. ఈ అంశాల మీద చర్చ జరగడం సమంజసమే. ఎవరి అంచనాలు వారు వేస్తూనే ఉన్నారు. కానీ ఈ మొత్తం వ్యవహారంలో జ్ఞానేశ్‌కుమార్ నాయకత్వంలోని ఎన్నికల కమిషన్ నడవడిక ఆందోళనకరంగా తయారైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పక్షం చేష్టలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న దశలోనూ ఎన్నికల కమిషన్‌కు అధికార పక్షం ఆగడాలు కనిపించడం లేదు. తమకు అనుకూలంగా ఓటు వేస్తారనుకున్న బీజేపీ ఇతర ప్రాంతంలోని బీహార్ వలస కార్మికులను బీహార్‌కు తరలించడానికి ప్రత్యేక రైళ్లను నడిపినా ఎన్నికల కమిషన్ కిమ్మన లేదు. ప్రత్యేక రైళ్లను నడపడంపై రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యేక రైళ్ల గుట్టు విప్పి రైల్వే శాఖను ప్రశ్నించారు. రైల్వే శాఖ సిబల్ ప్రశ్నలకు సమాధానం చెప్పింది. కానీ అందులోనూ అసత్యాలే ఉన్నాయి. రెండో తేదీననే హర్యానాలోని రోహ్తక్ నుంచి బీహార్‌కు ప్రత్యేక రైలు నడిపారు. ఇది రిజర్వేషన్లు లేని ప్రత్యేక రైలు అని రైల్వే శాఖ సమాధానం ఇచ్చింది. నిజానికి అది రిజర్వేషన్లు ఉన్న ప్రత్యేక రైలే. ఛాట్ పూజకోసం స్వస్థలాలకు వెళ్లాలనుకున్న వారి కోసం ప్రత్యేక రైళ్లు నడిపామని రైల్వే శాఖ చెప్తోంది. జనం మాత్రం రైళ్లలో చోటు దొరకక నానా ఇబ్బంది పడ్డారు. ఓటర్లను తరలించే రైళ్లలో మాత్రం టికెట్లు కూడా బీజేపీయే కొన్నది. కపిల్ సిబల్ ప్రత్యేక రైళ్లు నడిపిన తీరు ప్రశ్నిస్తుండగానే పట్నాలో తేజస్వీ యాదవ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆరో తేదీన తొలి దశ పోలింగ్‌లో ఎంత మంది పాల్గొన్నారు, అందులో మహిళలు ఎందరు, పురుషులు ఎందరు అన్న వివరం మాత్రం ఎన్నికల కమిషన్ చెప్పడం లేదని విరుచుకుపడ్డారు. మరో వేపు ఎన్నికల ప్రచారం కోసం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పట్నాలో మకాం వేశారు. ఈ క్రమంలో ఆయన గాంధీ మైదాన్ పరిసరాల్లో ఉన్న మౌర్యా హోటల్‌లో కొంతమంది అధికారులను రహస్యంగా కలుసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఆ సందర్భంగా ఆ హోటల్‌లోని లిఫ్టులను నిలిపి వేశారు. సీసీకెమెరాలు పని చేయకుండా వాటి మీద కాగితాలు అంటించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అంశాలేవీ ఎన్నికల కమిషన్‌కు కనిపించలేదు. వినిపించలేదు. బీహార్‌లో ఎన్నికల బందోబస్తు కోసం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల నుంచి బలగాలను తీసుకొచ్చి నియోగించారు. కానీ బీహార్‌కు పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ నుంచి బలగాలను పిలిపించలేదు. దీని మర్మం ఏమిటో సహజంగానే ఎన్నికల కమిషన్ చెప్పలేదు. చెప్పదు. బీజేపీ ఏలుబడిలోని రాష్ట్రాల నుంచి 208 కంపెనీల బలగాలను పిలిపించారు. కానీ పొరుగు రాష్ట్రాల నుంచే కాక తమిళనాడు, కేరళ వంటి ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల నుంచి బలగాలను తరలించలేదు. చివరకు మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్ నుంచి కూడా బలగాలను తరలించారు. భద్రతా దళాలను ఎక్కడి నుంచి పిలిపించాలి, ఎక్కడెక్కడ ఎలా వినియోగించాలి అన్న విషయం ఎన్నికల కమిషన్ పరిధిలోనే ఉంటుంది. అలాంటప్పుడు ఎన్నికల కమిషన్ బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల నుంచే భద్రతా దళాలను పిలిపించడం అంటే ఎన్నికల కమిషన్ నేరుగా బీజేపీతో కుమ్మక్కు అయిందని చెప్పడానికి పెద్ద పరిశోధన అవసరమే లేదు. కొద్ది రోజుల నుంచి అమిత్‌షా బీహార్‌లోనే మకాం వేసి ఉన్నారు. అంటే భద్రతా దళాల నియామకంలో ఆయన మాటనే ఎన్నికల కమిషన్ అక్షరాలా పాటించిందనుకోవాలి.

ఈ వ్యవహారం ఇక్కడితో ఆగలేదు. బలగాలను నియమించడమే కాదు, అధికారుల నియామకం కూడా అమిత్‌షా ఆదేశాల మేరకే జరిగింది. అంటే ఎన్నికల కమిషన్ ఈ విషయంలోనూ బీజేపీ మాటను జవదాట లేదు. ఎన్నికల కమిషన్ నోరెత్త లేదు. ఎన్నికల కమిషన్ బీజేపీ ఆగడాలను అడ్డుకోదు. పైగా బీజేపీ చేతిలో పరిచారికగా మారిపోయింది. ఎన్నికల కమిషన్ లెక్కలు తేల్చకపోయినా మహిళలు ఎక్కువగా ఓటు వేశారని, మహిళల ఓట్లు ఎన్డీయేకు అనుకూలంగానేపడ్డాయని కూడా ప్రచారం జోరుగా సాగింది. అంటే ఎన్డీయేకు అనుకూల వాతావరణం ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఓటు వేసిన పురుషులు ఎందరు, మహిళలు ఎందరు అన్న లెక్క చెప్పకపోవడంలో మర్మం అనుమానాలకు తావిస్తోంది. మహిళల, పురుషుల ఓటు వేయడంలో 2020 కన్నా ఇప్పుడు గమనించదగినంత అధికంగా మహిళలు ఓటు వేశారని చెప్పడానికి ఆధారాలు లేవని ఎన్నికల విశ్లేషకులు అంటున్నారు. అయినా ఓటు వేసిన స్త్రీ పురుషుల లెక్క చెప్పకపోవడం అంటే ఎన్డీయేకు అనుకూలంగా ఏర్పాటు చేసిన వాతావరణానికి విఘాతం కలగకుండా ఎన్నికల కమిషన్ జాగ్రత్త పడుతోందనుకోవాలి. అశీష్ రంజన్ అనే ఎన్నికల విశ్లేషకుడు సహ్రాలోని మిషీ నియోజక వర్గంలో పోలింగ్ సరళిని అధ్యయనం చేశారు. దాని ప్రకారం 2020లో ఈ నియోజకవర్గంలో 81,315 మంది పురుషులు, 93, 152 మంది మహిళలు ఓటు వేశారు. అంటే స్త్రీ పురుషుల మధ్య 11 వేలకన్నా ఎక్కువ తేడా ఉంది. అదే 2025లో ఇదే నియోజక వర్గంలో 95, 358 మంది పురుషులు ఓట్లు వేస్తే 1, 060 389 మంది మహిళలు ఓటు వేశారు. మళ్లీ తేడా దాదాపు 11 వేలే. పురుషుల కన్నా మహిళలు అధికంగా ఓటు వేసినప్పటికీ పురుషులు కూడా ఎక్కువ సంఖ్యలోనే ఓటు వేశారు. పురుషుల ఓట్లు 14000 కన్నా ఎక్కువగా ఉన్నాయి. మహిళా ఓటర్లు పెరిగింది 13 వేలే. పోలింగ్ జరిగిన నాలుగు రోజుల తరవాత అయినా ఓటు వేసిన పురుషులు, స్త్రీల సంఖ్య వెల్లడించి ఉంటే ఈ గందరగోళం ఉండేదే కాదు. కానీ ఆ గణాంకాలు విడుదల చేయకపోవడానికి ప్రధాన కారణం మహిళా ఓటర్లు ఎన్డీయేకు అనుకూలంగా ఉన్నారు అన్న వాదన రెండో విడత పోలింగ్‌లో కూడా ప్రభావం చూపాలని ప్రయత్నిస్తున్నట్టు ఉంది. సమగ్ర, సునిశిత ఓటర్ల జాబితా సవరణ తరవాత బీహార్‌లో మునుపటి కన్నా ఓటర్ల సంఖ్య తగ్గింది. ఈ తగ్గడంలో స్త్రీలూ ఉంటారు. పురుషులూ ఉంటారు. బీహార్‌లో 18 నుంచి 39 సంవత్సరాల మధ్య ఉన్న ఓటర్లు 3.5 కోట్ల మంది ఉన్నారు. ఈ వివరాలు కూడా ఎన్నికల కమిషన్ ఇవ్వలేదు. తవ్వుతూ పోతే ఎన్నికల కమిషన్ చేస్తున్న గోల్‌మాల్ చాలా ఎక్కువగా కనిపిస్తోంది. మన ప్రజాస్వామ్యంలో ఓటర్లకు అధికారం దక్కేది కేవలం ఎన్నికల సమయంలోనే. అందులోనే ఎన్నికల కమిషన్ అవకతవకలకు పాల్పడి మన ప్రజాస్వామ్య కుదుళ్లనే భంగం చేస్తున్నట్టుంది.

కోటలు దాటే మాటలు

చింతపట్ల సుదర్శన్

గోడ పక్కన తీరిగ్గా కూచుని తోక తిప్పుకుంటున్నది డాంకీ. మరో గోడకు ఓనరయిన డాగీ నోటిలో నుంచి నాలుకని ఇవతల పడేసి ఊపుతున్నది. దూరంగా ఓ ఆకారం కనపడ్డంతో గస్తీ తిరగడం అలవాటైన గూర్ఖాలా చెంగున లేచి నిలబడ్డది డాగీ. ఇది ఎవరి వైపో తీక్షణంగా చూస్తున్నది ఇక 'బౌబౌ' లు మొదలుపెడ్తుంది అనుకున్న డాంకీ ఆ వస్తున్నదెవరా అని పరీక్షగా చూసింది. అది ఓ వీధి కుక్క ఇంకేముంది బిచ్చగాడికి బిచ్చగాడే శత్రువయినట్లు కుక్కకి కుక్కే కదా ఎనిమీ ఇప్పుడిక్కడ మరో ప్రపంచ యుద్ధం జరగబోతున్నది అని లేచి నిలబడింది చెవులు మూసుకోలేదు కనుక నిస్సహాయంగా.

అయితే ఆ వస్తున్న వీధి కుక్క సరాసరి అరుగు ఎక్కడం మొదలుపెట్టినా, లేచి నిలబడి 'సమరానికి నేడే ప్రారంభం' అన్న ఫోజులో ఉన్న డాగీ నోరు తెరవనేలేదు. 'వింత వింత లోకంలో ఎంతెంతో తిరిగాను' అనుకున్న డాంకీ, ఏమోయి! నోరు మూతపడింది. 'భౌకారాలు' వినిపించడం లేదు. కుక్కకి కుక్క కనిపిస్తే చేసే పని మొదలుపెట్టనే లేదు అంది. అదేంటి డాంకీ. ఇంటికి అతిథి వస్తే స్వాగతం పలకాలి కాని అరుస్తారా ఎవరైనా అంది డాగీ.

రంగస్థలం

ఆశ్చర్యం గాడిద డొక్కలో పొడిచింది. 'మాయామాయా ఇదేమి మాయా' అని పాడాలనుకుని గొంతు పెగలక అలా చూస్తుండిపోయింది. ఆ వచ్చిన డాగీ ఈ డాగీ మూతులతో షేక్‌హేండ్ ఇచ్చుకుని కూచున్నవి.

పేపర్ వెయిట్‌లంత కళ్లేసుకుని ఆశ్చర్యపడక్కర్లేదు. ఇది మన వీధిలో కుక్కే అప్పుడప్పుడూ కలుస్తాం, 'చాటింగ్' చేసుకుంటాం. ఒకరి కష్టం ఒకరు తెల్సుకోడంలో తప్పేం ఉంది అంది డాగీ. అవునా అలాగా ఫ్రెండ్షిప్పా! సరేనప్పా! ఇంతకీ ఇప్పుడు నీ ఈ 'గెస్టు' రాకకు కారణమేమిటో అనడిగింది డాంకీ. బుల్డోజర్లతో హైడ్రావాడు ఇళ్లు కూల్చి మనుషుల్ని దిక్కులేకుండా చేస్తున్నాడు కదా, దీనికీ ఇప్పుడలాంటి సమస్యే వచ్చింది అంది డాగీ. ఏమిటో ఆ 'బర్నింగ్ ప్రాబ్లమ్' అనడిగింది డాంకీ. అప్పుడు ఆ వచ్చిన డాగీనే మాట కలిపింది. నీ సంగతులన్నీ నాకు తెల్సు, నువ్వు చాలా 'ఇంటలిజెంటు' వని ఏ సమస్యకైనా సమాధానం చెప్పగలవనీ అంది నీ ఈ ఫ్రెండ్లీ డాగ్. అందుకే 'కన్సల్టేషన్' కి వచ్చానంది అతిథి డాగీ.

అవునసుకో! అంది డాంకీ, అది తన్ను మెచ్చుకున్నందుకు సంబరపడుతూ, విషయం చెప్తే కదా తెలిసేది అని వాక్యం ముగించింది. ఏం చెప్పమంటావు"డాంకీ బ్రో ఈ మధ్య మనుషులందరికీ డాగీలదే పెద్ద సమస్య అయిపోయింది. కోర్టువారు మేం జనాల మధ్య ఉండవద్దన్నార్ట. మమ్మల్ని జనం నుంచి వేరుచేసి ఎక్కడైనా దాచేయాలంటున్నార్ట కదా! అంది ఆ వచ్చిన డాగీ. అవును. ఇప్పుడు కుక్కలు బస్‌స్టాండుల్లోనూ, దేవాలయాల ప్రాంగణాల్లోనూ, ఆసుపత్రుల వార్డుల్లోనూ, స్ట్రీట్ ఫుడ్ అమ్మే బండ్ల చుట్టూనూ విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, జనాల మధ్య ఉండటం వల్ల అసాంఘిక పనులకు అనగా అరిచి గీ పెట్టడం, భయపెట్టడం, కరిచి కండ పీకడం వంటి వాటికి తెగబడుతున్నాయని, కుక్కల జాతిని మనుష్య జాతి నుంచి పూర్తిగా వేరు చెయ్యాలని కోర్టు భావిస్తున్నది మరి అంది డాంకీ. అదెలా కుదురుతుంది. అదెలా న్యాయం అవుతుంది. ఎప్పటి నుంచో మనుషుల్తో కల్సి జీవిస్తున్నాం. మనుషులకు బానిసలుగా పని చేస్తున్నాం. నమ్మకంగా ఇళ్లు కాపలా కాస్తున్నాం. ఇన్నేళ్లకి ఇప్పుడు మమ్మల్ని మళ్లీ ఫారెస్ట్ పాలు చేస్తారా, క్రూర మృగాలకు ఆహారం చేస్తారా అంది ఆ స్ట్రీట్ డాగ్ విచారంగా.

అప్పుడు అరుగు ఎక్కాడు అబ్బాయి. కొత్త డాగీని చూసి కొంచెం తడబడ్డాడు కూడా. అది నా ఫ్రెండు 'బ్రో' బాలాజీ టెంపుల్ ఆవరణలో ప్రసాదం తింటూ బతికే వెజిటేరియన్ డాగ్ ఎవర్నీ ఏమీ అనదు అనవసరంగా అరవదు, మనిషి భాష అర్థం కాదు కానీ ఎప్పుడు ఎలా నడచుకోవాలో దానికి తెల్సు అంది డాగీ. అబ్బాయి తన జాగాలో కూచుంటూ గుళ్లో తిరిగే డాగీ అయినా, బస్‌స్టాండులో బతికే వీధి కుక్కయినా, ఇక నించి జనాల మధ్య తిరగడానికి వీల్లేదని కోర్టు ఉత్తర్వులు వచ్చాయి మరి అన్నాడు అబ్బాయి, ఆ టెంపుల్ డాగీ వైపు జాలిగా చూస్తూ. భూ దందాలు చేసేవాళ్లు, సెటిల్‌మెంట్లు చేసేవాళ్లు ఐఏఎస్, ఐపీఎస్‌లను కూడా భయపెట్టే వాళ్లు ఊళ్లో ఉండవచ్చునా? యధేచ్ఛగా అరాచకాలు చెయ్యవచ్చునా అంది డాంకీ. అవును డాంకీ నువ్వన్న వాళ్లందరినీ ఇప్పుడు మర్యాదగా రౌడీలు అని పిలుస్తున్నారు. ఠాణాల్లో వాళ్ల పేరుమీద 'షీట్లు' తెరిచి గౌరవిస్తున్నారు. వాళ్లని స్ట్రీట్ డాగ్స్‌తో కంపేర్ చెయ్యరాదు. వాళ్ల హోదా వేరు, వాళ్ల స్టేటస్ వేరు. వాళ్లకు ఇవ్వాల్సిన మర్యాద ఇవ్వాల్సిందే అన్నాడు అబ్బాయి నవ్వుతూ.

నిజమే! వాళ్లు మామూలోళ్లు కాదు. కాబోయే రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులూ, మంత్రులూ కదా! కలికాలం. ముందు ముందు పోలీసు స్టేషన్లల్లో ఎక్కువ కేసులు నమోదయి ఉన్నవారినే ఎన్నికల బరిలోకి దింపేట్టున్నాయి అన్ని పార్టీలు. వారయితే నయాన్న కాకుండా భయాన్న ఓటర్లను దారికి తెస్తారు మరి అంది డాంకీ.

అయితే మనమంతా అడవి బాట పట్టాల్సిందేనా అంది వచ్చిన డాగీ. అడవిలోకి పంపరు అపార్టుమెంట్లల్లో, విశాలమైన భవనాల్లో ఉంచి వేళకు భోజనం పెడతారు అంది మన డాగీ.

నీ ఫ్రెండ్‌ని భయపడవద్దని చెప్పు. మనుషులకే దిక్కులేదు వీధి కుక్కలకు వసతీ భోజనం జరిగేదేం కాదు. మీకు తెలుసా మన కోర్టులు ఇచ్చిన లక్షల తీర్పులు అమలుకు నోచుకోకుండా ఉన్న సంగతి. ఇదీ అంతే! అన్నాడబ్బాయి.

మన నాయకులయినా ఇంతే కదా మాటలు కోటలు దాటుతాయి కాని మనుషుల రాతలు మారవు అంది డాంకీ.

వాహనాలు కావవి... 'మృత్యు' శకటాలు

ప్రొఫెసర్ పీటాబాబీవర్ధన్

రహదారులు రక్తమోడుతున్నాయి. మనుషుల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారుతున్నాయి. ఒకచోట ప్రయాణికుల బస్సులు మంటలకు ఆహుతి అవుతుంటే, మరోచోట ఆగివున్న బస్సులు, కార్లను మరో పెద్ద వాహనం ఢీకొని ప్రాణాలు మట్టిలో కలిసి పోతున్నాయి. గతనెల చివరి వారంలో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళున్న కావేరి ట్రావెల్స్ ప్రైవేటు బస్సు కర్నూలు దగ్గర బైక్‌ను ఢీకొనడంతో డీజిల్ ట్యాంకులో మంటలు చెలరేగాయి. ఇరవై మంది సజీవ దహనమయ్యారు. లగేజీ డిక్కీలో మొబైల్ ఫోన్లు, బ్యాటరీలు పేలి, మంటలు అదుపులోకి రాని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా చిన్నా పెద్దా ప్రాణాలు మంటల్లో కాలి బూడిదైపోయాయి. ఈ సంఘటన మరువక ముందే ఈ నెల మూడో తేదీన వేర్వేరు ప్రమాదాల్లో అనేక మంది చనిపోయారు. వీటిల్లో చేవెళ్ల బస్సు ప్రమాదం అత్యంత తీవ్రమైందిగా చెప్పాలి. నిండుగా ప్రయాణీకులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న గ్రావెల్ టిప్పర్ ఢీ కొనడంతో, బస్సులో ఒకవైపు కూర్చున్న ప్రయాణీకులు మొత్తం ప్రాణాలు కోల్పోయారు. బస్సులో ఇరుక్కున్న మిగతా ప్రయాణీకుల ఆర్తనాదాలతో సంఘటన స్థలం మారుమోగింది. బయట నుంచి క్రేన్ వచ్చి టిప్పర్‌ని లాగే దాకా బస్సు లోపల ఉన్న ప్రయాణికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈ ప్రమాదంలో 20 మందికి పైగా ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆడపిల్లలు మృతుల్లో ఉండడం పెద్ద విషాదం. అదేరోజు బాపట్ల సమీపంలో మరో ట్రక్కు ప్రమాదంలో ఐదుగురు మరణించారు. ఏలూరు దగ్గర సంభవించిన మరో రోడ్డు ప్రమాదంలో ఇంకో ముగ్గురు మృతి చెందారు. అనకాపల్లి-యలమంచిలి జాతీయ రహదారిపై జరిగిన వేరొక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తప్ప తాగి టెంపో నడిపిన ఒక డ్రైవర్ తప్పిదం వల్ల రాజస్థాన్‌లో అదే రోజు ఇరవై మంది చనిపోయారు. తాగిన మత్తులో టెంపో నడుపుతున్న డ్రైవర్ దాదాపు పది పదిహేను వాహనాలను ఢీకొని బీభత్సం సృష్టించాడు. అనేక మంది ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యాడు. ఒకే రోజు ఇన్ని చోట్ల రోడ్లు మృత్యు కుహరాలు అవ్వడానికి కారణాలేంటి? రోడ్ల నిర్మాణం ఎలావుంది? వాహనాల పరిస్థితి ప్రమాదాలకు కారణమా? మానవ తప్పిదాలు ఎంతవరకు కారణం? రోడ్డు రవాణా అధికారుల అలసత్వం ఏమాత్రం ఉంది? వంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు వెతికి, పరిష్కారాలు సూచించడమే మా ఈ ప్రయత్నం. రోడ్డు, వాహన ప్రమాదాలు ఒక ప్రాంతానికో, ఒక దేశానికో పరిమితం కావడం లేదు. ప్రపంచంలో ప్రతి దేశమూ వీటికీ మినహాయింపు కాదు. ఎంతో అభివృద్ధి చెందిన అమెరికాలో అత్యంత ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయంటే ఆశ్చర్యం కలిగిస్తోంది కదూ. కానీ ఇది నిజం. ఏటా లక్షకు పైగా జరిగే వివిధ రకాల రోడ్డు ప్రమాదంలో మూడు లక్షల మంది చనిపోతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. మెక్సికో కూడా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే దేశంగా గుర్తింపు పొందింది. ఆఫ్రికా దేశాల్లో సగటున గంటకు రెండు వాహన ప్రమాదాలు జరగడం విస్తుగొలిపే అంశమే మరి. మధ్య ప్రాచ్య దేశాల్లోనే విరివిగా వాహనాల ప్రమాదాలు జరుగుతాయని తెలుస్తోంది. ఫ్రాన్సు ప్రమాదాలకు నెలవుగా పేరు పొందింది. జపాన్‌లోనూ రోడ్డు, వాహన ప్రమాదాలు ఎక్కువేనని 'ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ ఫోరమ్' (ఐటీఎఫ్) గణాంకాలు తెలుపుతున్నాయి. కెనడా ప్రజా రవాణాకు పెట్టింది పేరు. సామాన్య ప్రజల నుంచి ఉద్యోగులు, రాజకీయ నాయకులు సైతం ప్రజారవాణాను ఉపయోగిస్తారు. వాహన కాలుష్యం నుంచి దేశాన్ని

రక్షించేందుకు కెనడా తీసుకున్న మంచి చర్యగా దీన్ని భావిస్తారు. రకరకాల కారణాల వల్ల ఇక్కడ కూడా వాహన ప్రమాదాలు ఎక్కువేనని తెలుస్తోంది. జర్మనీ, పోలాండ్ దేశాలు వాహనాల తయారీ రంగానికి పెద్ద పీట వేస్తాయి. కాని ప్రమాదాలను మాత్రం నివారించలేక పోతున్నాయి. పోర్చుగల్, తుర్కియా దేశాల్లో రోడ్లు రక్తసిక్తం కావడం సర్వ సాధారణం అని 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' (హు) గణాంకాలు తెలుపుతున్నాయి.. ఇక అభివృద్ధి తోపాటు సౌందర్యానికీ, సాంస్కృతిక వారసత్వానికి అధిక ప్రాధాన్యతనిచ్చే ఇంగ్లండ్ దేశంలో కూడా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. భారతదేశంతో సహా ప్రపంచంలో చాలా దేశాలు రోడ్డు ప్రమాదాలకు పేరు పొందగా, అతితక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే దేశంగా నెదర్లాండ్స్ రికార్డు నెలకొల్పుతోంది. ప్రపంచంలోనే అతి సురక్షితమైన రోడ్ల వ్యవస్థ నెదర్లాండ్స్ సొంతమని ఐటీఎఫ్ తెలుపుతోంది.

మన దేశంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువనే చెప్పాలి. ప్రపంచ దేశాలతో పోలిస్తే మనం రెండో స్థానంలో ఉన్నాం. ఇక్కడ ఏటా రెండు లక్షలకు పైగా వాహనాల ప్రమాదాలు జరుగుతుంటే పాతిక వేల మంది పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. దేశ రాజధాని ఢిల్లీ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే రాష్ట్రంగా రికార్డు సాధించినట్లు 'నేషనల్ క్రైమ్ రిపోర్ట్ బ్యూరో'(ఎన్‌సీఆర్‌బీ) తెలిపింది. 2024లో ఒక్క ఢిల్లీలోనే లక్ష పైగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు తెలుస్తోంది.. చాలా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారని నివేదిక సారాంశం.. ఢిల్లీ తర్వాత తమిళనాడులోని చెన్నైలోను, కర్నాటక లోని బెంగళూరులోను ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనీ, ఏటా ఇక్కడ వేలసంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని తెలుస్తోంది. గతేడాది తమిళనాడులో 65 వేల ప్రమాదాలు జరిగితే ఆరు వేల మంది వరకూ చనిపోయినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 54 వేల వాహనాల ప్రమాదాలు జరగ్గా, ఈ సంఘటల్లో సుమారు పది వేల మంది చనిపోయినట్లు బ్యూరో నివేదిక వల్ల తెలుస్తోంది. కేరళలో44 వేల ప్రమాదాలు సంభవించగా వివిధ ప్రాంతాల్లో నాలుగు వేల మంది మృతి చెందినట్లు సమాచారం. పశ్చిమ బెంగాల్‌లోని ఒక్క కోల్‌కతాలోనే 30 వేలకు పైగా ప్రమాదాలు జరిగితే ఎనిమిది వేల మంది చనిపోయారని గణాంకాలు తెలుపుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 42 వేల ప్రమాదాలు, ఆంధ్రప్రదేశ్‌లో 20 వేల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ సంఘటనల్లో నాలుగు వేల మంది చనిపోయారని బ్యూరో నివేదిక వల్ల తెలుస్తోంది. ఎందువల్ల ఇంత దారుణ ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే... అంశానికి సంబంధించి విశ్వవిద్యాలయాల స్థాయిలో చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. కొన్నాళ్ల క్రితం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఐటీఎం విభాగం ఆధ్వర్యంలో కొంత పరిశోధన జరిగింది. రోడ్డు, వాహనాల ప్రమాదాలు జరగడానికి కారణాలు ఏమిటన్న విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. అనువైన రోడ్లు లేకపోవడం, గుంతలు పడిన రోడ్లు, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, అపసవ్య (రాంగ్) మార్గంలో వాహనాలు నడపడం, రోడ్డు లైన్లు మారేటప్పుడు సిగ్నల్ ఇవ్వకపోవడం, పరిమితిని మించి వేగంగా వాహనాలు నడపడం, వాహనాలు నిర్వహణ సక్రమంగా చేయలేకపోవడం, రవాణా శాఖ అధికారుల్లో అవినీతి పెరిగిపోవడం, లంచాలు మరిగి అడ్డగోలుగా ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీచేయడం, అత్యవసర ద్వారాలు సకాలంలో తెరుచుకోక పోవడం, ఏసీ యంత్రాలు సక్రమంగా పనిచేయకపోవడం, కిటికీలకు కర్టన్లు, సీట్లకు రెక్సిన్ వాడకం, రోడ్డు సేఫ్టీ ఆడిట్ నిర్వహించక పోవడం వగైరా కారణాల వల్ల వాహనాల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఐటీఎం నివేదిక సారాంశం..

నివారించలేకపోయినా, తగ్గించడం సులువే!

రకరకాల కారణాల వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించడం వీలుపడక పోవొచ్చు కానీ, కొన్ని జాగ్రత్తలు, నిబంధనలు పాటిస్తే కనీసం ప్రమాదాల శాతాన్ని తగ్గించడం వీలవుతుందని అంతర్జాతీయ ట్రాఫిక్ ఫోరమ్ తెలియచేస్తోంది. లైసెన్స్ విధానం పటిష్టంగా అమలు చేయడం వాటిల్లో ప్రధానమైనది. బస్సులు, లారీలు, ట్రక్కులు వంటి భారీ వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్ల జారీని కఠినతరం చెయ్యాలి. మద్యం మత్తులో వాహనాలు నడపడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన శిక్షలు విధించాలి. మంటలు, పేలుళ్లకు అవకాశం ఉన్న సామాన్లను బస్సుల్లో అనుమతించకూడదు. సురక్షిత డ్రైవింగ్‌కి ప్రాధాన్యత నివ్వాలి. వేగ నియంత్రణ సూచనలు తప్పక పాటించాలి. ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేసేలా చూడాలి. పాటించేలా చెయ్యాలి. మొబైల్ ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం తీవ్ర నేరంగా, భావించి కఠినంగా శిక్షించాలి. వాహనాల మధ్య దూరాన్ని తప్పక పాటించాలి. కార్లలో డ్రైవర్‌తో పాటు తోటి ప్రయాణీకులు కూడా సీటు బెల్టులు ధరించాలి. ముందు వెళ్తున్న వాహనాన్ని దాటి వెళ్లేందుకు వేగాన్ని పెంచకూడదు. అలా చేస్తే, సింగిల్ రోడ్డు మార్గంలో ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీ కొనే ప్రమాదం ఉంది. దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు వాహనాలు తప్పక తనిఖీ చేయించాలి. లైసెన్సులు మంజూరు చేసేటప్పుడే రవాణా చట్టాల పట్ల అవగాహనకు సంబంధించిన పరీక్షలు నిర్వహించాలి. జంక్షన్లు మారేటప్పుడు రెండు వైపులు చూసి రోడ్డు మారాలి. కంటిచూపు విషయంలో ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. గుండె జబ్బులు, బీపీ ఉన్న వాళ్లు వాహనాలు నడపక పోవడం శ్రేయస్కరం. ఎమర్జెన్సీ తలుపులు పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుండాలి. ఘాట్లు, కొండ ప్రాంతాల్లో బస్సులు నడిపే వారు ప్రత్యేక శిక్షణ తీసుకోవడం ఉత్తమం. ఇలా కొన్ని చిన్న చిన్న సూచనలు పాటిస్తే పెద్ద పెద్ద ప్రమాదాల నుంచి ప్రయాణికులను కాపాడిన వారు అవుతారు. మిమ్మల్ని మీరూ రక్షించుకో గలుగుతారు. ఏమంటారు? మైనరు పిల్లలు వాహనాలు నడుపుతుంటే 'మా వాడు గొప్పోడై పోయాడు హైస్పీడుతో రెచ్చిపోతాడు' అని తెగ మురిసిపోయే తల్లిదండ్రులకు పోలీసు స్టేషన్లల్లో కౌన్సెలింగ్ ఇప్పించాలి. జరిమానాలు విధించాలి.

జర్నలిజం పూర్వపు విభాగాధిపతి డీన్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం
9393100566

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కేసీఆర్‌కు అగ్నిపరీక్ష



పతకమూరు దామోదర్‌ప్రసాద్

హైదరాబాద్ మహానగర పరిధిలోని జూబిలీహిల్స్ శాసనసభా స్థానానికి 11 న జరిగే ఉపఎన్నిక ప్రచారం పూర్తయి, పోలింగ్‌కు సర్వం సిద్ధంగా ఉంది. బీజేపీతో సహా 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ విజయసాధనకు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అగ్నిపరీక్షగా నిలిచింది. జూబ్లీహిల్స్ స్థానానికి మూడుసార్లు ప్రాతినిధ్యం వహించిన నాయకుడు మాగంటి గోపీనాథ్ ఆకస్మికంగా మరణించడంతో జరుగుతున్న ఉపఎన్నికలో గోపీనాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపి సానుభూతి ఓట్లతో మళ్లీ గెలవాలని భారత రాష్ట్రసమితి (బీఆర్ఎస్) గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. ఈ సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకుని తదుపరి జరిగే అసెంబ్లీ ఎన్నికలలో సత్తా చాటి, కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా తేవాలనే వ్యూహంతో బీఆర్ఎస్ శ్రమిస్తోంది. కేటీఆర్, హరీశ్‌రావు అనేక మంది మాజీ మంత్రులు, శాసనసభ్యులు, స్థానిక నేతలను వీరు వెంటబెట్టుకుని ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం చేశారు. నియోజక వర్గంలోని శ్రీనగరకాలనీ, బోరబండ, వెంగళరావునగర్, షేక్‌పేట, ఎర్రగడ్డ, యూసుఫ్ గూడా, కార్పొరేషన్ పరిధిలోని ఏడు డివిజన్లలోని బస్తీలు, మురికివాడలు, ప్రధాన రహదారులలో బీఆర్ఎస్ మాజీమంత్రులు, శాసన సభ్యులు సీహెచ్ మల్లారెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, ఎస్.నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, వివేకానంద గౌడ్ ప్రభృతులు గల్లీ గల్లీలో ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్ ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకోవాలని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బీసీ సాధికారత నినాదంతో కాంగ్రెస్ స్థానిక యువకుడు, బీఆర్ఎస్ నేత శ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్‌ను హస్తం అభ్యర్థిగా పోటీకి దింపి గెలుపుకోసం కృషిచేస్తోంది. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు సహా మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ వంటి నేతలే గాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికను వ్యక్తిగత ప్రతిష్ఠగా తీసుకుని వివిధ డివిజన్‌లలో విస్తృతంగా ప్రచారం చేశారు. దాదాపు 4 లక్షల ఓటర్లున్న జూబ్లీహిల్స్‌లో 1.4 లక్షల బీసీ, లక్ష ముస్లిం, 20 వేల క్రైస్తవ ఓటర్లున్నారు. నిజానికి ఈ స్థానం మినీ భారత్. ఉత్తరాది వారు, తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రధాన సామాజిక వర్గాల వారూ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల సంఖ్యలో వున్నారు. ఈ ఎన్నిక మోదీ, కేసీఆర్ ద్వయానికి, రేవంత్, రాహుల్, ఒవైసీ మధ్య జరుగుతున్న పోరుగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న ముస్లింలను ఆకట్టుకోవడానికి కొద్దిరోజుల ముందే క్రికెట్ ఆటగాడు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి మైనారిటీ వ్యవహారాల శాఖను కట్టబెట్టారు. మజ్లిస్ పార్టీ పోటీ చేయకుండా ఈసారి హస్తం పార్టీకి మద్దతు ప్రకటించడం విశేషం.

కేసీఆర్ ప్రభుత్వం మైనారిటీలను నిర్లక్ష్యం చేసిందని, ముస్లిం రిజర్వేషన్లను 4 నుంచి 12 శాతానికి పెంచుతామని చెప్పి మోసం చేసిందని మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తోందని, పదేళ్ల తర్వాత కొత్త కార్డులను ఇచ్చిందని, ఇళ్లకు ఉచిత కరెంటు, రూ500 కే వంట గ్యాస్ సరఫరా చేస్తోందని చెబుతూ, జూబ్లీహిల్స్‌లో గెలిస్తే మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓటర్లకు హామీ ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం వేలకోట్లు కొల్లగొట్టి యువతకు ఉద్యోగ, ఉపాధిని నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 70 వేల ప్రభుత్వ ద్యోగాలను భర్తీ చేసి ఆదుకున్నామని, రానున్న కాలంలో మరిన్ని పరిశ్రమలు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని సీఎం భరోసా కల్పించారు. పార్లమెంటులో మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వినాశకర బిల్లులకు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలకడం చూస్తే కేసీఆర్ మోదీకి నమ్మకమైన మిత్రుడుగా ఉన్న సంగతి తెలుస్తోందని, అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎంగా ఉందని గతంలో ఆరోపించిన మోదీకి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని తెలిసినా, రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిచారణ జరిపి, సీబీఐ, సీఐడీతో విచారణ జరిపించాలని శాసనసభ తీర్మానించి కేంద్రానికి పంపినా, ఫార్ములా రేస్‌లో అవినీతి జరిగినా మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, కారు గుర్తుకు ఓటేస్తే కమలానికి ఓటేసినట్లేనని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ అని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఇది ముస్లింలను బుజ్జగించడమేనని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు విమర్శలు సంధించారు. జూబ్లీహిల్స్ కేంద్ర బొగ్గు మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభా స్థానం పరిధిలో ఉన్నా ఆయన తెచ్చిన నిధులేమీ లేవని, కిషన్‌రెడ్డి, కేటీఆర్ అభివృద్ధి నిరోధకులని రేవంత్ ధ్వజమెత్తారు. కేంద్రం 2014-23 మధ్య తెలంగాణకు 9 లక్షల కోట్ల నిధులిచ్చిందని, సీఎం అసత్య ఆరోపణలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి చెప్పుకున్నారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక హైడ్రా పేరుతో ఇళ్లు కూలగొట్టడం మినహా పేదలకు చేసిందేమిలేదని కేటీఆర్ విమర్శించగా, చెరువుల ఆక్రమణలు తొలగించి నీటి వనరులను అభివృద్ధిపై చర్చిస్తున్నామని, మూసీ ఆక్రమణలు తొలగించి నగరాన్ని నందనవనం చేస్తుంటే కేటీఆర్, హరీశ్ సహించలేక పోతున్నారని సీఎం విమర్శించారు. బోరబండ చౌరస్తాలో పీజేఆర్ విగ్రహం, అమీర్‌పేట మైత్రీవనం కూడలిలో తెలుగుతేజం ఎన్టీఆర్ విగ్రహం నెలకొల్పుతామని హామీ ఇచ్చి రేవంత్ వారి మన్ననలు పొందారు. జూబ్లీహిల్స్‌లో ఆధునిక ఐటీఐ, మహిళా కళాశాల నెలకొల్పుతామని, మరెన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామని చెబుతూ ఎలాగయినా హస్తం పార్టీ గెలుపు సాధించి తీరాలనే పట్టుదలతో సీఎం ప్రచారం సాగించారు. జూబ్లీహిల్స్‌లో సంపన్న వర్గాలు ఉన్నా పేద, మధ్యతరగతి వారే అధికం. బస్తీలు, మురికివాడలలో పారిశుద్ధ్య, మంచినీటి సరఫరా సరిగా లేకపోవడం, మురుగునీటి పారుదల సరిగా లేక నీరు రోడ్లపైకి రావడం, రోడ్లు గండ్లుపడి అధ్వాన్నంగా, దుర్గంధం వెదజల్లడం ప్రజలను పీడిస్తున్న ప్రధాన సమస్యలు. రూ 500 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తయితే సమస్యలు తీరుతాయని మంత్రులు, అధికార పార్టీ నేతలు అంటున్నారు. ఉప ఎన్నికలో హస్తం పార్టీ ఓడితే సీఎం రేవంత్ పదవికి వెంటనే ముప్పు లేకపోయినా అసమ్మతి పెరిగి, నాయకత్వ మార్పుకోసం కాంగ్రెస్ నేతలు మళ్లీ అసమ్మతి కార్యక్రమాలు మొదలెడితే ఇబ్బందులు తప్పక పోవచ్చు. కేసీఆర్ ప్రచారానికి రాకపోగా కనీసం కారు గుర్తుకు ఓటేయమని ప్రకటన చేయక పోవడం ఆ పార్టీ శ్రేణులకు కొంత నిరుత్సాహం కలిగించింది. ఈ ఉప ఎన్నిక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టకు పోటీగా భావిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత సానుభూతిపై ఆశపెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రభావం చూపితే విజయం ఖాయమన్న ధీమాతో ఉన్నారు. ఓటర్లు ఏం తీర్పు ఇస్తారో చూడాల్సిందే.

సీనియర్ జర్నలిస్టు, సెల్ 9440990381

ఉద్యోగ సంక్షోభం... వలసల భయం

- జెహానాబాద్ యువతలో ఆందోళన
- బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీకి ఎదురుదెబ్బేనా?

జెహానాబాద్: బీహార్‌లో పాలక ఎన్డీయే ప్రభుత్వంపై యువత తీవ్ర ఆగ్రహంతో ఉంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కొనసాగుతున్న సమయంలో ఈ పరిస్థితి జేడీ(యూ), బీజేపీ కూటమికి ఎదురుదెబ్బగా మారింది. రాష్ట్రంలో ఉద్యోగ సంక్షోభం, వలసల భయాలు నెలకొన్నాయి. వాగ్దానాలను కాకుండా... చర్యలను యువత కోరుకుంటున్నారు. జెహానాబాద్ బస్‌స్టాండ్ వద్ద 25 ఏళ్ల సైన్స్ గ్రాడ్యుయేట్, ఆటోరిక్షా డ్రైవర్ వికాస్ కుమార్ 2025 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిరాశ వ్యక్తం చేస్తూ... ఈసారి తదుపరి బీహార్ ప్రభుత్వం 'చర్య', 'కొత్త ప్రారంభం' కోరుకుంటున్నామని చెప్పారు. నిరుద్యోగం, వలసలపై తమ ఆందోళనను వ్యక్తం చేయడానికి తోటి డ్రైవర్లు గుమిగూడగా... కుమార్ పీటీఐతో మాట్లాడుతూ రూ.3.5 లక్షల రుణంపై తన వాహనాన్ని కొనుగోలు చేసినప్పటికీ తాను 'చాలా తక్కువ' సంపాదిస్తున్నానని, తనలాంటి ఇతరులు నిరుద్యోగులుగా మిగిలిపోవడం లేదా రాష్ట్రం విడిచి వెళ్లవలసి వస్తుందన్నారు. కానీ ప్రస్తుత ఎన్నికల తర్వాత వచ్చే బీహార్ ప్రభుత్వం తమ పరిస్థితిని మారుస్తుందేమోనన్న ఆశాభావంతో ఉన్నారు. కుమార్ వంటి విద్యావంతులకు ఈ ఎన్నికల్లో నిరుద్యోగం ఒక పెద్ద సమస్య. ఉద్యోగాల సృష్టికి ప్రాధాన్యతనిచ్చే... తద్వారా ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసలను అరికట్టే ప్రభుత్వానికి ఆయన మద్దతు ఇస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ప్రారంభించిన తన గ్యారేజీని నడపడంలో తన తండ్రికి సహాయం చేసే 20 ఏళ్ల సమీర్ కుమార్ తన ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశాడు. తన తండ్రి అడుగుజాడల్లో నడవాలని ఆయన భావిస్తున్నారు. 'చదువు పూర్తి చేసిన తర్వాత కూడా చాలా మంది ఉద్యోగాలు లేకుండా లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. మేము విశ్వకర్మ సమాజానికి చెందినవాళ్లం. నాకు చాలా కలలు ఉన్నాయి. కానీ జెహానాబాద్‌లో జీవన వేగం చాలా నెమ్మదిగా ఉంది' అని ఆయన తెలిపారు. జెహానాబాద్ జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలు... జెహానాబాద్, ఘోసి, మఖ్దుంపూర్ ఉన్నాయి. వీటికి నవంబరు 11న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్డీఏ జెహానాబాద్ మాజీ ఎంపీ చదేశ్వర్ ప్రసాద్ జేడీ(యూ) అభ్యర్థిగా బరిలోకి దిగగా, ఇండియా ఐక్య సంఘటన నుంచి రాహుల్ కుమార్ ఆర్జేడీ టికెట్‌పై గట్టి పోటీ ఇస్తున్నారు. ఇక ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ కూడా అభ్యర్థిని నిలబెట్టింది. అయితే స్థానికుల అభిప్రాయం ప్రకారం... జెహానాబాద్ స్థానంలో ప్రధానంగా ఎన్డీఏ, ఇండియా ఐక్య కార్యాచరణ మధ్యే పోటీ నెలకొంది. ఇక ఘోసి స్థానంలో సీపీఐ(ఎంఎల్) నుంచి రాంబాలి సింగ్ యాదవ్.. జేడీ(యూ) కి చెందిన రితురాజ్ కుమార్‌తో తలపడుతున్నారు. ప్రస్తుతం రాంబాలి సింగ్ యాదవ్ తరపున ప్రచారం చేస్తున్న గయకు చెందిన తారిఖ్ అన్వర్ (33), సాంప్రదాయ కుల లెక్కలతో పాటు 20 ఏళ్ల పాలనను మార్చాలనే కోరిక' ప్రజలలో ఉందని చెప్పారు. అయితే జెహానాబాద్‌లోని జేడీ(యూ), బీజేపీ మద్దతుదారులు నితీశ్ కుమార్ పాలనలో, మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పుకొస్తున్నారు. సెప్టెంబరు చివరలో ప్రారంభించిన మహిళా రోజ్‌గార్ యోజన... 'ఓటర్లను ఆకర్షించడానికి ఒక ఎన్నికల కుట్ర' అని చాలా మంది ఆరోపిస్తున్నారు. 243 మంది సభ్యులున్న అసెంబ్లీలో 121 స్థానాలకు నవంబరు 6న ఎన్నికలు జరిగాయి. మిగిలిన 122 నియోజకవర్గాలకు నవంబరు 11న ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు నవంబరు 14న జరుగుతుంది. జెహానాబాద్ పట్టణంలో పట్నా-గయా రైలు మార్గానికి దిగువన ఉన్న చాలా పాత రోడ్డు అండర్‌పాస్ వద్ద నీరు నిలిచిపోవడం వంటి పౌర సమస్యలు ఆందోళన కలిగించే విషయం. స్థానికులు తదుపరి ప్రభుత్వం ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుకుంటున్నారు. గయ జిల్లాలో గతంలో భాగమైన జెహానాబాద్, కొన్ని దశాబ్దాల క్రితం ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. 1990లలో ఈ ప్రాంతంలో కుల సంబంధ హింస జరిగింది. జెహానాబాద్ పట్టణ నివాసి సంజయ్ సింగ్ మాట్లాడుతూ 'ఆ హింసాకాండ కాలం నాకు గుర్తుంది. కానీ ఏ ప్రభుత్వం కూడా ఎక్కువ కాలం అధికారంలో ఉండకూడదని నేను భావిస్తున్నాను. ప్రభుత్వాలు మారడం ప్రజాస్వామ్యానికి మంచిది' అని అన్నారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల రెండవ దశ ప్రచారం ముగిసినందున ఇండియా ఐక్య సంఘటన ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ జెహానాబాద్ జిల్లాలో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు.

ఓట్ల చోరీని అడ్డుకుంటాం

- అమిత్‌షాతో కుమ్మక్కైతే తీవ్ర పరిణామాలు
- ఎన్నికల అధికారులకు తేజస్వీ హెచ్చరిక
- 18న ప్రమాణస్వీకారం చేస్తానని ధీమా

పట్నా: ఎన్నికల సంఘంపై ఆర్జేడీ నాయకుడు మహాఘట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ నిప్పులు చెరిగారు. బీహార్‌లో ఓట్ల చోరీని, వంచనను సహించబోమని స్పష్టం చేశారు. బీహార్‌లో మొదటి విడత పోలింగ్ జరిగి 4 రోజులు గడిచిన తర్వాత కూడా స్త్రీ, పురుషులు, థర్డ్ జెండర్ ఓటర్ల డేటా ను ఎందుకు వెల్లడించలేదని ఈసీని మీడియా ముఖంగా ప్రశ్నించారు. ఇలా జరగడం ఇదే మొదటిసారని, గతంలో ఈ గణాంకాలను వెంటనే ఇచ్చేవారన్నారు. ఎన్నికల సంఘం సరిగ్గా పనిచేయడం లేదని తేజస్వి యాదవ్ ఆరోపించారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో ఈసీ కుమ్మక్కై సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తే... అధికారులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని ఆయన హెచ్చరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి మొత్తం 208 కంపెనీల భద్రతా సిబ్బందిని బీహార్ ఎన్నికల విధుల కోసం ఎందుకు మోహరించవలసి వచ్చిందని ప్రశ్నించారు. పోలీసుల్లో ఏకంగా 68 శాతం మంది బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందినవారేనని, తాము వారిపై నిఘా ఉంచుతున్నామని తెలిపారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో సహా బయటి వ్యక్తులు బీహార్‌ను నియంత్రించాలని కలలు గంటున్నారని... దీనిని బీహార్ ప్రజలు అనుమతించరని తేజస్వీయాదవ్ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీపై కూడా తేజస్వీ విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో మోదీ బీహార్‌లోని నిరుద్యోగం, వలసలు వంటి సమస్యల గురించి మాట్లాడలేదన్నారు. కేవలం కుటిల రాజకీయాలు చేశారని ఆరోపించారు. మంత్రులు సామ్రాట్ చౌదరి, డాక్టర్ దిలీప్ జైస్వాల్, మంగళ్ పాండేలపై ఉన్న అవినీతి ఆరోపణలపై ఆయన ఏమీ మాట్లాడలేదని, హులాస్ పాండే, ఆనంద్ మోహన్, సునీల్‌పాండే, మనోర్మ దేవీ లాంటి వారితో మోదీ వేదిక పంచుకున్నారన్నారు. వారేమైనా నిజాయితీపరులైన రాజకీయ నాయకులా? కోట్లాది రూపాయల సృజన్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన విపిన్ శర్మను మోదీ పట్నాలో కలిశారంటే తేజస్వి విమర్శల వర్షం కురిపించారు. బీహార్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నవంబర్ 18న తాము ప్రమాణ స్వీకారం చేస్తామన్నారు. శాంతి భద్రతల విష యంలో రాజీపడేది లేదని, మహాగట్బంధన్ బీహార్ ఎన్నికల్లో గెలిస్తే నేరస్థులు, మతతత్వ శక్తులు, అవినీతిపరులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అలాగైతే కంపెనీలు మూతే

దగ్గుమందు మరణాలపై కేంద్రం అల్టిమేటం

న్యూఢిల్లీ: 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల ఆయా రాష్ట్రాల్లో చిన్నారులు మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఔషధ తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం సోమవారం అల్టిమేటం ఇచ్చింది. జనవరి ఒకటి నాటికి అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. లేకపోతే కంపెనీలు మూసుకోవాల్సిందేనని హెచ్చరించింది. 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దగ్గు మందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా కంపెనీ తయారుచేసింది. మరణాల కారణంగా ఈ కంపెనీలో తనిఖీ చేయగా... సిరప్‌లో 48.6 శాతం అత్యంత విషపూరితమైన డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలినట్లు విచారణాధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్లోకి ప్రవేశించిందని, ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని దర్యాప్తులో భాగంగా గుర్తించారు. సరైన తయారీ పద్ధతులు అవలంబించడం లేదని, 300కు పైగా ఉల్లంఘనలను రికార్డు చేసినట్లు చెప్పారు. శ్రేసన్ ఫార్మా అనుమతులను తమిళనాడు ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే.

విద్యాసంస్థల్లో వందేమాతరం తప్పనిసరి: సీఎం యోగి



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం గేయాలాపనను తప్పనిసరి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. గోరఖ్‌పూర్‌లో 'ఏక్తా యాత్ర' పేరుతో నిర్వహించిన సామూహిక వందేమాతరం గేయాలాపన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. విద్యాసంస్థల్లో జాతీయ గీతాలాపన చేయడంవల్ల విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే దానిపై గౌరవం, దేశభక్తి ఏర్పడుతాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి ఈ నెల ఏడో తేదీతో 150 ఏళ్లు పూర్తయ్యాయని చెప్పారు. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిందని వెల్లడించారు. కాగా, ఈ గేయాన్ని 1875 నవంబరు 7న బంకించంద్ర ఛటర్జీ రాశారు. ఈ గేయం తొలిసారి 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది.

ఇంజిన్‌లో సాంకేతిక సమస్య... విమానానికి తప్పిన ప్రమాదం

కోల్‌కతా: స్పైస్‌జెట్ విమానానికి తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. విమానం ఇంజిన్లలో ఒకదానిలో సాంకేతిక సమస్య తలెత్తింది. వెంటనే గుర్తించిన పైలట్ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం విమానాన్ని కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా దించారు. స్పైస్‌జెట్ సంస్థకు చెందిన ఎస్‌జీ 670 విమానం ఆదివారం రాత్రి ముంబై నుంచి కోల్‌కతా కు బయల్దేరింది. అయితే, కాసేపట్లో విమానం కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగుతుంది అనుకుంటుండగా ఒక ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. అనంతరం ఈ విషయాన్ని ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం అందించారు. పైలట్ నుంచి సమాచారం అందగానే ఎయిర్‌పోర్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. అక్కడ ఎమర్జెన్సీ ప్రకటించారు. అగ్నిమాపక, సహాయక బృందాలను రన్‌వే వద్ద సిద్ధంగా ఉంచారు. అయితే, విమానం రాత్రి 11:38 గంటలకు సురక్షితంగా దిగింది. ప్రయాణికులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

నిస్సహాయ పాలన నుండి విముక్తి

- బీహార్‌లో మహాగట్బంధన్ సర్కార్ ఏర్పాటు ఖాయం
- ప్రజలికిచ్చిన హామీలను అమలు చేసి తీరతాం
- కాంగ్రెస్ నాయకులు ఖర్గే, జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: బీహార్‌లో ఎన్నికల అనంతరం మహాఘట్బంధన్ ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని కాంగ్రెస్ పేర్కొంది. దానికి ప్రధాన కారణం ఇండియా ఐక్యసంఘటన రాష్ట్ర అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక కలిగి ఉందని వెల్లడించింది. 20 ఏళ్లలో ఎన్డీఏ తప్పుడు వాగ్దానాలు, అసభ్యకర భాష మినహా ప్రజలకేమీ ఇవ్వలేదని విమర్శించింది. ఇక మహాఘట్బంధన్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ... మహాఘట్బంధన్ ప్రభుత్వం 20 సంవత్సరాల 'నిస్సహాయ పాలన' నుండి బీహార్‌ను విముక్తి చేస్తుందన్నారు. 'ఇప్పుడు వలసలు ఆగిపోతాయి. యువత భవిష్యత్తు నుండి చీకటి తొలగిపోతుంది. ప్రతి ఇంటికీ ప్రకాశవంతమైన రేపనే రోజు ఉంటుంది. మేము అన్యాయాన్ని అంతం చేస్తాం. బీహార్‌ను సామాజిక న్యాయంతో మారుస్తాం" అని ఖర్గే 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. దళితులు, మహాదళితులు, గిరిజనులు, వెనుకబడినవారు, అత్యంత వెనుకబడినవారు, ఆర్థికంగా బలహీన వర్గాలు, మైనారిటీలు తమ హక్కులను పొందుతారని ఖర్గే తెలిపారు. మహిళలు, రైతులు, యువత, సమాజంలోని ప్రతి వర్గం ఆర్థిక అభ్యున్నతిని అనుభవిస్తుందని అన్నారు. 'బీహార్ ప్రజలు రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చడానికి బయలుదేరారు! మేము బీహార్ వైభవాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇస్తున్నాం. దానిని ఆచరణలో చేసి చూపిస్తాం' అని ఖర్గే అన్నారు. ఈ సందర్భంగా మహాఘట్బంధన్ ఇచ్చిన కీలక హామీలను గుర్తు చేశారు. ఇక కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ కూడా 'ఎక్స్' వేదికగా మాట్లాడుతూ 20 సంవత్సరాల్లో ఎన్డీఏ నాయకులు బీహార్‌కు అసభ్యకరమైన భాష, తప్పుడు వాగ్దానాలు మాత్రమే అందించినప్పటికీ బీహార్ అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని నిర్ధారించడానికి ఇండియా కూటమికి స్పష్టమైన, దృఢమైన రోడ్‌మ్యాప్ ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో క్లిప్‌ను పోస్ట్ చేశారు. అందులో ఎన్డీఏ నాయకులు ప్రతిపక్ష నాయకులను కఠిన పదజాలంతో విమర్శిస్తుండగా...ఖర్గే, పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా మహాఘట్బంధన్ హామీలను హైలైట్ చేస్తూ కనిపించారు. ఈసారి బీహార్‌లో మహాఘట్బంధన్ ప్రభుత్వం ఖాయమని రమేష్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, యువతకు ఉద్యోగావకాశాలు వంటి మహాఘట్బంధన్ ఇచ్చిన ముఖ్యమైన 20 హామీల జాబితాను రూపొందించారు. మహిళలకు నెలకు రూ.2,500 సహాయం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు సర్వీస్, జీవికా దీదీలకు రూ.30,000 జీతం, వృద్ధులకు రూ.1,500 నెలకు పెన్షన్, వికలాంగులకు రూ.3,000 నెలకు పెన్షన్, రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స తదితర హామీలను ఆయన హైలైట్ చేశారు. ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను 20 నుండి 30శాతానికి, ఎస్సీ రిజర్వేషన్లను 16 నుండి 20శాతానికి, ఎస్టీ రిజర్వేషన్లను 1 నుండి 2శాతానికి పెంచుతామని కూడా మహాఘట్బంధన్ హామీ ఇచ్చిందని రమేశ్ వెల్లడించారు. ఎస్సీ/ఎస్టీ వేధింపుల కేసుల సత్వర విచారణ కోసం ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తామని, అత్యంత వెనుకబడిన తరగతులపై దౌర్జన్యాల నివారణ చట్టం ఆమోదించబడుతుందని, అత్యంత వెనుకబడిన, భూమిలేని వర్గాలకు సమిష్టి వ్యవసాయం కోసం భూమి లీజులు మంజూరు చేస్తామని, రిజర్వేషన్ పరిమితిని 50శాతానికి పెంచే చట్టం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చబడుతుందని, సహారాలో చిక్కుకున్న నిధులను రాబట్టడానికి ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయబడుతుందని తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండో దశ పోలింగ్ మంగళవారం జరగనుండగా... 14న లెక్కింపు చేపడతారు.

మోదీ వల్లే ఎన్‌డీయేలో ఉన్నా: చిరాగ్

పట్నా: ప్రధాని మోదీ అంటే తనకు చాలా అభిమానమని ఎల్‌జేపీ (రాంవిలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ చెప్పారు. ఆయనకు బేషరతుగా తన మద్దతు ఉంటుందని వెల్లడించారు. మంగళవారం బీహార్‌లో రెండో విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో జాతీయ మీడియా సంస్థ పాడ్‌కాస్ట్‌లో చిరాగ్ మాట్లాడారు. 'మన ప్రధానమంత్రి ఉన్నంతకాలం నేను ఎక్కడికి వెళ్లాలనుకోవడం లేదని మరోసారి గట్టిగా చెప్పాలని అనుకుంటున్నాను. నా అంకితభావం, అభిమానం అలాగే ఉన్నాయి. ఆయనంటే నాకు అమితమైన అభిమానం. మోదీ వల్లే నేను ఎన్డీయేలో ఉన్నాను' అని అన్నారు. నవంబర్ 14న ఫలితం మీకు అనుకూలంగా రాకపోవచ్చని కొందరు వ్యాఖ్యానిస్తున్నా రన్న ప్రశ్నకు... అలా అనుకోవడం మంచిదే అన్నారు. అలాంటి ఆలోచన తమపై చెడు దృష్టిని నివారిస్తుందన్నారు. తనలో తన తండ్రి నేర్పిన విలువలు ఉన్నాయని, ఎన్నికల ఫలితాల తర్వాత ఇతరులతో పొత్తులు ఉండవని స్పష్టం చేశారు.

సిద్ధరామయ్యపై వేటు తప్పదా?

అపాయింట్‌మెంట్ ఇవ్వని కాంగ్రెస్ పెద్దలు

బెంగళూరు: కర్నాటకలో కొంతకాలంగా ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు వెలువడుతున్నాయి. నవంబరులో ఈ మార్పు ఉండొచ్చన్న ప్రచారం జోరుగా నడుస్తోంది. దీంతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బెంగళూరు, ఢిల్లీ మధ్య తిరుగుతున్నారు. పెద్దలతో భేటీకిగాను సిద్ధరామయ్యకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సమయం ఇవ్వలేదని సమాచారం. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. నవంబరు చివరిలో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో సిద్ధరామయ్య ఢిల్లీకి వెళ్లనున్నారు. ఒక పుస్తక విడుదల కార్యక్రమంలో పాల్గొనున్నారు. అప్పుడే సీనియర్ కాంగ్రెస్ నేతలతో భేటీ అయ్యేందుకు సమయం కోరగా... ఆ సమావేశం అవసరం లేదని కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు స్పష్టం చేసిందని సమాచారం. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు వార్తలు రావడం గమనార్హం. కేంద్ర నాయకత్వం సమయం ఇవ్వడానికి నిరాకరించినా... సిద్ధరామయ్య తన ప్రభుత్వంపై విశ్వాసం వ్యక్తంచేశారు. 'మరో రెండున్నరేళ్లు మన పార్టీనే అధికారంలో ఉంటుంది. వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌కే ఓటు వేస్తారనే నమ్మకం నాకు ఉంది' అని కార్యకర్తలను ఉద్దేశించి చెప్పారు. ఇదిలాఉంటే, సీఎం క్యాంప్‌నకు చెందిన ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్... ఎమ్మెల్యేలు, మంత్రులకు ఢిల్లీలో విందు ఏర్పాటు చేశారు. తన సోదరుడు, ఎంపీ రాజశేఖర హిట్నాల్ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎవరు సిద్ధరామయ్య వైపు ఉన్నారనే బలప్రదర్శన కోసం దీనిని నిర్వహించినట్లు తెలుస్తోంది. మరోవైపు... వారం వ్యవధిలో రెండుసార్లు డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. 'ఓట్ చోరీ' అంశంలో భాగంగా ఆయన దేశ రాజధానిలో పర్యటిస్తున్నారు. కాగా... ముందుగా ఇచ్చిన హామీకి అనుగుణంగా పార్టీ తనకు ఏ క్షణంలో అయినా ముఖ్యమంత్రిగా అవకాశం కల్పిస్తుందని డీకే శివకుమార్ భావిస్తున్నారు. తొలివిడత కూర్పులో ముఖ్యమంత్రికి మద్దతుగా ఉన్న నాయకులకే మంత్రివర్గంలో చోటు దక్కింది. ఈసారి కూర్పులో తనకు మద్దతుగా ఉండే నాయకులకు పెద్దపీట వేసే దిశలో ఉప ముఖ్యమంత్రి పావులు కదుపుతున్నారు. బీహార్ ఫలితాలు వచ్చిన వెంటనే రాహుల్ గాంధీ విదేశాలకు వెళతానని ప్రకటించారు. రాహుల్ లేకుండా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు లేకపోవడంతో అంతకుముందే జాబితాను పార్టీ అధిష్ఠానానికి పంపించాలని డీకే భావిస్తున్నారు.

జైలులో ఖైదీల జల్సా...

ఉన్నతాధికారుల సస్పెన్షన్

బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరు సెంట్రల్ జైలులో ఖైదీల జల్సాకు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం స్పందించింది. జైలు ఉన్నతాధికారులపై చర్యలు చేపట్టింది. పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు చాలా స్వేచ్ఛగా జీవిస్తున్నారు. మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నారు. టీవీలతో కాలక్షేపం చేస్తున్నారు. కొందరు సొంతంగా వండుకుని తింటున్నారు. మందు పార్టీలు చేసుకుని చిందులు వేస్తున్నారు. ఖైదీల చట్టవిరుద్ధ కార్యకలాపాలు, వీఐపీ మర్యాదలు, మద్యం తాగడం, డ్యాన్సులు వేయడం వంటి వీడియోలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జైలు సూపరింటెండెంట్ మాగేరి, జైలు ఏఎస్పీ అశోక్ భజంత్రీలను సస్పెండ్ చేసింది. జైలు చీఫ్ సూపరింటెండెంట్ సురేష్‌ను బదిలీ చేసింది. జైలులో జరుగుతున్న చట్టవిరుద్ధ సంఘటనలపై కేసులు నమోదు చేసినట్లు హోం మంత్రి జీ పరమేశ్వర తెలిపారు. జైలులో పరిస్థితిని సమీక్షించిన తర్వాత మరిన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇంటి పైకప్పు కూలి ఐదుగురి దుర్మరణం

పట్నా: బీహార్‌లోని పట్నా జిల్లాలో ఇంటి పైకప్పు కూలి ఒకే కుటుంబానికి ఐదుగురు దుర్మరణం చెందారు. అకిల్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మనాస్ గ్రామంలో ఆదివారం రాత్రి 9.45 గంటల సమయంలో ఓ ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. అందరూ నిద్రలో ఉండగా ఇంటి పైకప్పు కూలడంతో పడుకున్నవాళ్లు పడుకున్నట్లే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. శిథిలాల నుంచి మృతదేహాలను తొలగించి పోస్టుమార్టానికి పంపించారు. పైకప్పు కూలిన ఇళ్లు 30 ఏళ్ల క్రితం నాటివని, శిథిలావస్థకు చేరుకుని ఉండటంతో అకస్మాత్తుగా కూలిపోయిందని తెలిపారు.

స్వచ్ఛమైన గాలి కోరేవారు నేరస్థులా?

కాలుష్య నిరసనల అణచివేతపై రాహుల్, జైరాం రమేశ్ ధ్వజం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో వాయు నాణ్యతను తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న ప్రజలను ఆదివారం ఢిల్లీ పోలీసులు ఎందుకు అదుపులోకి తీసుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ సోమవారం ప్రశ్నించారు. 'శుభ్రమైన గాలిని పొందడం ప్రాథమిక మానవ హక్కు శాంతియుతంగా స్వచ్ఛమైన గాలిని కోరుతున్న పౌరులను నేరస్థులలా ఎందుకు చూస్తున్నారు' అని రాహుల్ సోషల్ మీడియా పోస్ట్‌లో ప్రశ్నించారు. ప్రజలందరినీ తీసుకువెళ్లి 'బస్సులోకి తోసేశారు' అని పర్యావరణ వేత్త విమ్లేందు ఝా చేసిన ప్రకటనను ఆయన తిరిగి పోస్ట్ చేశారు. 'వాయు కాలుష్యం కోట్లాది మంది భారతీయులను ప్రభావితం చేస్తోంది. మన పిల్లలను, మన దేశ భవిష్యత్‌ను దెబ్బతీస్తోంది. కానీ ఓటు దొంగతనం ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పట్టించుకోదు. సంక్షోభాన్ని పరిష్కరించడానికి కూడా ప్రయత్నించడం లేదు' అని రాహుల్ పేర్కొన్నారు. 'స్వచ్ఛమైన గాలిని కోరుతున్న పౌరులపై దాడి చేయడానికి బదులుగా మనం ఇప్పుడే వాయు కాలుష్యంపై నిర్ణయాత్మక చర్య తీసుకోవాలి' అని అన్నారు. ఆదివారం ఇండియా గేట్ వద్ద జరిగిన నిరసన సందర్భంగా నిర్వాహకులు... పోలీసు అధికారులు తమపై ప్రదర్శనను రద్దు చేయాలని అనేక సార్లు ఒత్తిడి తీసుకువచ్చారని, అనేక మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి పేరు పెట్టిన కర్తవ్య మార్గంలో ఐకానిక్ ఇండియా గేట్ ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ అన్నారు. 'మెరుగైన గాలి నాణ్యత కోసం నిరసన తెలుపుతున్న ఢిల్లీ పౌరులు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51-ఎ(జి) ప్రకారం తమ సొంత కర్తవ్యాన్ని మాత్రమే నిర్వహించాలనుకుంటున్నారు. 'ఇది సహజ వాతావరణాన్ని రక్షించడం, మెరుగుపరచడం' అని వారిని ఆదేశించింది' అని తెలిపారు. 'అందువల్ల వారు నివసించే, పనిచేసే చోట దారుణమైన గాలి నాణ్యతపై తమ తీవ్ర ఆందోళనను తెలియజేయనీయకుండా ఢిల్లీ పోలీసులు వారిని ఎందుకు నిరోధిస్తున్నారు? ప్రభుత్వం కర్తవ్యంలో ఘోరంగా విఫలమైనప్పుడు ప్రజలు తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలి' అని అన్నారు.

కూలిన వాటర్ ట్యాంక్...

నివాసాలను ముంచెత్తిన నీరు



తిరువనంతపురం: కేరళలోని కొచ్చిలో తమ్మనం ప్రాంతంలోగల కుతప్పడి ఆలయానికి సమీపంలో ఉన్న 1.38 కోట్ల లీటర్ల నిల్వ సామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంక్ సోమవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో కుప్పకూలింది. కేడబ్ల్యూఏ ఫీడర్ పంప్ హౌస్‌లోని వాటర్ ట్యాంక్‌లో కొంత భాగం కూలిపోవడంతో ఈ సంఘటన జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో అనేక ఇళ్లు నీటిలో చిక్కుకున్నాయి.. గాఢ నిద్రలో ఉన్న స్థానికులు ఆ శబ్దానికి లేచి చూడగా... అప్పటికే నీరు చుట్టుముట్టింది. దీంతో వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోరిక్షాలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. బురద, రాళ్లు ఇళ్లలోకి కొట్టుకొచ్చినట్లు స్థానికులు తెలిపారు. తమ్మనంలోని కొచ్చి కార్పొరేషన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ముంచెత్తింది. నిల్వ ఉంచిన మందులు, వైద్య పరికరాలు, కంప్యూటర్లు దెబ్బతిన్నట్లు ఆరోగ్య అధికారులు తెలిపారు. ఈ ట్యాంక్ 40 ఏళ్ల క్రితం నిర్మించినదని స్థానిక అధికారులు తెలిపారు. ఈ ట్యాంక్ నుంచి కొచ్చి, త్రిపునితుర ప్రాంతాలకు నీరు సరఫరా అవుతుందని వెల్లడించారు. మరోవైపు అధికారులు నష్టాన్ని అంచనావేసేందుకు చర్యలు చేపట్టారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సమస్యలను తక్షణం పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ లతో కలిసి, (109) దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టరు మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎంతో నమ్మకంతో మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా బీఆర్ఎస్ కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర, హైదరాబాద్ : రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా బీఆర్ఎస్ ప్రభుత్వంకృషి చేస్తుందని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మల్కాజిగిరి మండల పరిధిలోని నేరేడ్మెట్‌లో గల తహసీల్దార్ కార్యాలయంలో మల్కాజిగిరి సర్కిల్ లబ్ధిదారులకు ఆయన కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర- హైదరాబాద్ : సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (29) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-13 , ఇతర శాఖలు - 16, మొత్తం 29 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ హాస్టల్ నందు, గురుకులాలలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా, ఇబ్బందులు కలగకుండా చూడాలని, విద్యార్థులకు అందించే ఆహారంలో ఎక్కడ రాజీపడకుండా నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలను అరికట్టాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పత్తి కొనుగోలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం చేయకుండా ఉండకూడదని తెలిపారు. బాల్య వివాహాలను ఆపండి అనే పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి చేయాలని వినతి

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: హఫీస్ పెట్ డివిజన్‌లోని మైత్రి నగర్ ఫేస్ 3 లో గల పార్కులో తమరి అధికారులు రెయిన్ వాటర్ స్ట్రోమ్ డ్రెయిన్ నిర్మించారని, ఈ డ్రైనేజీ ని మొత్తం ఓపెన్‌గా పెట్టినారు ఈ డ్రెయిన్‌లో తవ్వగా వచ్చిన మట్టిని అదే పార్కులో అలాగే ఉంచారని మిద్దెల మల్లారెడ్డి తెలిపారు. పట్టణ ప్రాంతాలలో ప్రతి గజము విలువ లక్షలలో ఉంటుందని, మరి ఇంత ఖరీదైన స్థలాన్ని ప్రజల అవసరాల నిమిత్తం పార్కు కొరకు వదిలేశారని, ఈ పార్కులో మోరీలు కట్టి చెత్తాచెదారం వేసి ప్రజలకు వాకింగ్ చేయడానికి సదుపాయంగా లేదని, చిన్నపిల్లలు ఆడుకోవడానికి కూడా సదుపాయంగా లేదని తమరు స్వయంగా పరిశీలించి ఈ పార్క్ ను అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేయాలని మిద్దెల మల్లారెడ్డి కోరారు.

ప్రజా భూములు, పార్కింగ్‌ల రక్షణపై ఫిర్యాదు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిల్‌ల పరిధిలో జరుగుతున్న అక్రమాలపై 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజావాణి సమావేశంలో ఘాటుగా స్పందించారు. ప్రజా భూములు, పార్కింగ్ స్థలాల రక్షణ కోసం రెండు వేర్వేరు ఫిర్యాదులు సమర్పించారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లోని కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లోని సర్వే నంబర్లు 134, 135, 136లోని పార్కు భూమిని బిల్డర్లు ఆక్రమిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయం మీద వెస్ట్‌జోన్ అసిస్టెంట్ చీఫ్ సిటీ ప్లానర్ మెహ్రాను ప్రశ్నించారు. 'పార్క్ భూమిని బిల్డర్లకు అప్పగించడం అంటే ప్రజా హక్కులను అమ్మినట్టే. ఇలాంటి అక్రమాలపై కేసులు ఎందుకు వేయడంలేదు? అని ఆయన నిలదీశారు. అలాగే చందానగర్ సర్కిల్‌లోని గౌతమీనగర్ కాలనీలో బిల్డర్ పార్కింగ్ స్థలం, సెల్లార్ భాగాన్ని గదులుగా మార్చిన దందాపై కూడా ఆయన ఫిర్యాదు చేశారు. 'చట్టం ముందు ఎవరూ పెద్దవారు కాదు. ప్రజల కోసం ఉంచిన స్థలాలను వాణిజ్యంగా మార్చడం తగదు" అని భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. పార్క్ భూములు, పార్కింగ్ స్థలాలు ప్రజల సౌకర్యానికే వినియోగం కావాలని స్థానికులు కోరుతున్నారన్నారు.

అందెశ్రీకి ప్రముఖుల నివాళి

విశాలాంధ్ర, హైదరాబాద్ : లాలాపేట జయ శంకర్ ఇండోర్ స్టేడియంలో స్థానిక ప్రజలు, అభిమానులు, కవులు, రచయితలు అలాగే కళాకారులు అందెశ్రీ పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి రామకృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, వాకటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టి.ఎస్.ఎస్ చైర్పర్సన్ వెన్నెల గద్దర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రులు హరీష్ రావు, తారక రామారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావుగౌడ్, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, మాజీ ఎమ్మెల్సీలు కోదండరాం, కల్వకుంట్ల కవిత, మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్, వి.హనుమంతరావు, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, సిపి సజ్జనార్, టిఎస్ఎస్ సంచాలకులు ఏ నరసింహారెడ్డి అందెశ్రీ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

అందెశ్రీ ఆకస్మిక మృతి తీరనిలోటు : ఏఐటీయూసీ

డా.అందెశ్రీ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో నిరాక్షరాస్యుడైన పశువుల కాపరి, ఒక అనాదగా పెరిగి, ఏవిధమైన చదువు సంధ్యలులేని అందెశ్రీ పేరు ప్రఖ్యాతలు సంపాదించుకొన్నారు, వారి ఆకస్మిక మరణం తీరని బాధని మిగిల్చిందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ విచారం వ్యక్తం చేసారు. అందెశ్రీ మాట, పాట, ఆయన రచనలు సమాజాన్ని, పేద, మధ్యతరగతి ప్రజల మేలుకొల్పుకు కారణం అయ్యాయని ఆయన అన్నారు. అందెశ్రీ పాడిన పాటలు బాకులుగా, సూటిగా సమాజాన్ని ప్రశ్నిస్తు చైతన్యపరిచారు. మాటలు, పాటలతో కూడిన సినిమాలకు వ్రాసిన గొప్ప చరిత్ర అందెశ్రీదని ఆయన కొనియాడారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారాన్ని అందుకొని, తెలంగాణ మాతృగీతం రచించిన గొప్ప మానవతావాది, నిస్వార్థజీవి అని ఆయన కొనియాడారు. ఆయన వ్రాసిన పాటలలో 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' అనే పాట హృదయం ఉన్న ప్రతి గుండెను తట్టి లేపుతుందని ఆయన అన్నారు. అందెశ్రీలాంటి మరెందరో ప్రశ్నించే గొంతులు -హృదయమున్న వారు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని మరెందరో అందెశ్రీలు తయారు కావాలని ఎస్.బాల్‌రాజ్ అభిప్రాయపడుతు ఆయన మృతికి సంతాపం, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఘట్కేసర్ ఎన్ఎఫ్‌సి నగర్‌లో అందెశ్రీ అంత్యక్రియలు

మంగళవారం ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఘట్కేసర్ ఎన్.ఎ ఫ్.సి నగర్ లో అందెశ్రీ అంత్యక్రియలు నిర్వహిం చనున్నారు.అంత్యక్రియలకు హాజరై అందెశ్రీ పార్థివ దేహానికి ముఖ్యమంత్రి నివాళులు అర్పించనున్నారు. అందెశ్రీ ఆప్తులు, అభిమానులతో కలిసి అంతిమ యాత్రలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు.

అందెశ్రీ మృతి సాహిత్యానికి తీరని లోటు



తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగాలకు అపూర్వమైన సేవలందిం చిన ప్రముఖ కవి అందేశ్రీ మృతి మనందరికీ తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. 1961 జూలై 18న సిద్దిపేట జిల్లా రేబర్తి గ్రామంలో అందె యెల్లయ్యగా జన్మించిన అందేశ్రీ, అనాథగా పెరిగి జీవితంలోని కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ కవితా ప్రపంచంలో తనకంటూ ప్రత్యేకమైన స్థానం ఏర్పరుచుకు న్నారు. ఎటువంటి పాఠశాల విద్య లేకుండానే జీవితాన్ని గమనిస్తూ 3,000కి పైగా కవితలు, అనేక పాటలు రాసి ప్రజల హృదయాలను తాకారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఆయన రచనలు ప్రజల్లో ఉద్యమ జ్యోతి వెలిగించాయి. తెలంగాణ ప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తూ ఆయన రాసిన 'జయ జయ హె తెలంగాణ, జనని జయ కేతనం' పాటను తెలంగాణ ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో రాష్ట్ర గీతంగా స్వీకరించింది. ఇది ఆయనకు అమరత్వాన్ని ఇచ్చిన గొప్ప ఘట్టం. కాకతీయ విశ్వ విద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన ఆయన సాహిత్య, సాంఘిక కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరా లని, ఆయన కుటుంబ సభ్యుల కు, సర్వ జన వికాస్ మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్ సంతాపాన్ని తెలిపారు.

అందెశ్రీ మృతి తెలంగాణ సమాజానికి తీరనిలోటు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్ : తెలంగాణ రాష్ట్ర గీతమైన జయ జయహే తెలంగాణ రచయిత అందెశ్రీ ఆకస్మిక మృతి వార్త ఎంతో బాధాకరమని, ఇది తెలంగాణ సమాజానికి తీరని లోటు అని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అందెశ్రీ మరణంపై ఎమ్మెల్యే శంకర్ సోమవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో కవిగా తన పాటలతో సాహిత్యంతో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ మృతి తెలంగాణకు తీరనిలోటన్నారు. ఉద్యమ కాలంలో అందెశ్రీతో ఎంతోమంది కవులు, కళాకారులు, రాజకీయ నాయకులకు అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే శంకర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అందెశ్రీ మరణంతో శోకతప్త హృదయులైన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అందెశ్రీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే శంకర్ ప్రార్థించారు. ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, బాలరాజ్ గౌడ్, బస్వం, ముబారక్ అలీ ఖాన్, చంద్రశేఖర్, గోదా మాధవులు, ముబారక్ అలీఖాన్, శ్రీను నాయక్, సయ్యద్ ఖదీర్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: తెలంగాణ రాష్ట్ర గీతమైన జయ, జయ హే తెలంగాణ రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణ వార్త ఎంతో బాధాకరం అని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ.... తెలంగాణ సాహితీ లోకానికి ఇది తీరని లోటు అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన రాసిన గీతం ప్రజలలో చైతన్యాన్ని రగిలించి, అందరినీ ఒక్కతాటి మీదకు తీసుకువచ్చింది. ఆయన సాహితీ కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర గీతంగా జయ జయ హే తెలంగాణ ప్రకటించిన రోజున అందెశ్రీ కళ్లలో కనిపించిన ఆనందం, ఉద్విగ్నత నేటికీ తారసపడుతోందన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను.

10న చలో ఢిల్లీ : ఎంపీ. ఆర్ కృష్ణయ్య

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల కోసం చేసిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని, చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం జాతీయ స్థాయిలో ఉద్యమించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం హలో బీసీ ఛలో ఢిల్లీ కు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. డిసెంబర్ 10న ఢిల్లీలోని కన్స్టిట్యూషన్ క్లబ్ లో బీసీల డిమాండ్లపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు లో తెలంగాణ , ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి బీసీలు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీ ప్రధాని ఉన్న ఈ సమయంలోనే, బీసీల హక్కులను సాధించుకోవాల న్నారు. తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమం ఊపందుకుందని, ఆ ఉత్సాహంతోనే చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు దక్కించుకోవాలని ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంఘం కర్ణాటక, కేరళ, ఏపి ఇంచార్జ్‌గా బాణాల అజయ్ కుమార్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు నీల వెంకటేష్, ఎత్తారీ భీమ్ రాజ్, రాజేందర్, అనంతయ్య, సతీష్, అంజి గౌడ్, మోదీ రాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

బికె ఎనక్లేవ్ కాలనీ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: మియాపూర్ డివిజన్ పరిధిలోని బికె ఎనక్లేవ్ కాలనీకి నూతనంగా ఎన్నుకోబడిన అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. బీకె కాలనీ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. బీకె ఎనక్లేవ్ కాలనీ అసోసి యేషన్ వాసులు కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఏ చిన్న సమస్య అయినా తన దృష్టికి గాని తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గసభ్యులు కాలనీ వాసులందరికీ ఎల్లవేళాలో అందుబాటులో ఉంటూ సమస్యల పై స్పందిస్తూ ప్రతి ఒక్కరూ సమిష్టిగా కలిసి కాలనీ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో బీకె ఎనక్లేవ్ కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు, పద్మ, కార్యవర్గసభ్యులు ధనుంజయ్, మోహన్ రెడ్డి, వాహిని, ప్రభుసింగ్,సదానందం లక్ష్మణ్, నాగేశ్వరావు, రాయల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్లకై మరో దళిత ఉద్యమం

విశాలాంధ్ర, బషీర్ బాగ్: జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పెరిగిన జనాభాకు అనుకూలంగా ఎస్సీల రిజర్వేషన్ పెంచాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ సమావేశంలో మాట్లాడుతూ దశాబ్దాల క్రితం ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించారని ఇప్పుడు పెరిగిన జనాభాకు అనుకూలన 20 శాతం రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన విధంగా భారత ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేసింది 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అదేవిధంగా బీసీలకు 42 శాతం ఎస్టీలకు 12 శాతం ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మద్యపానం ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులుగా పులిజాల గెల్వయ ను నియమించారు. ఈ సందర్భంగా పులిజాల గెలువయ్య మాట్లాడుతూ ఎస్సీల జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్ల కొరకై మరో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కొత్త ఉద్యమానికి పలుకుతామని అన్నారు. రిజర్వేషన్ల పెంపు కోసం మాదిగ మాల ఉపకులాలను కలుపుకొని ఉద్యమం చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు దీపక్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు గజ్జల మల్లికార్జున్, మార్వాడి గో బ్యాక్ కోఆర్డినేటర్ డాక్టర్ బొమ్మెర స్టాలిన్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు డాక్టర్ మీసాల మల్లేష్, బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, తెలంగాణ దళిత దండు నాయకుల్లో ఎర్రమళ్ళ మొగులయ్య,ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, మాదిగ యూత్ జేఏసీ అధ్యక్షులు నక్క మహేష్, బుర్ర సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాచేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర -మొయినాబాద్ : ప్రభుత్వ భూములను ఎవరూ కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలతో పాటు చట్టరీత్యా చర్యలు తప్పవని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ -33లో సుమారు 0.25 గుంటల భూమిని ప్రక్కన భూమి ఉన్న వ్యక్తి కబ్జాచేసి తన భూమిలో కలిపి వేసి పైపులైన్ వేయడం జరిగిందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ గౌతమ్ రెవెన్యూ సిబ్బందితో కలిసి కబ్జా జరుగుతున్న స్థలాన్ని పరిశీలించి పనులను నిలిపివేయించారు. అనంతరం ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వ భూములను ఎవరూ కబ్జాచేసిన చట్టరీత్యా చర్యలుంటాయన్నారు. ఎంతటివారైనా ఉపేక్షించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్ రాజేష్, సర్వేయర్ జలజ, జీపీవో రాజేశ్వర్ , రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మొయినాబాద్ : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల సహకార సంఘం కార్యాలయ ఆవరణలో తెలంగాణ మార్క్ ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ చేవెళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి,స్థానిక నాయకులు,అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మొక్కజొన్నను మద్దతు ధర రూ.2400లకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

విశాలాంధ్ర-జవహర్ నగర్ : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వికలాంగుల కాలానికి బస్సు సర్వీసులు నడపడానికి అనుమతి ఇవ్వాలని సోమవారం జవహర్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ వసంతను కలిసి వినతి పత్రం అందజేశారు. బాలాజీ నగర్ ప్రధాన రహదారి సాయిబాబా కమాన్ నుండి వికలాంగుల కాలనీ వరకు బస్సు ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయో గకరంగా ఉంటుందన్నారు. ప్రధాన రహదారి నుంచి వికలాంగులు సామాన్య ప్రజలు వికలాంగుల కాలనీ వారికి నడిచి వెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తే అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తుండడంతో బస్ సర్వీస్ ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగుల సతీష్, మార్వాడి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కబునీతో గంగూలీ భాగస్వామ్యం కోచింగ్‌లో కొత్త దశ

విశాలాంధ్ర - హైదరాబాద్ : మంచి కోచింగ్ వల్ల పిల్లలు మెరుగ్గా నేర్చుకుంటారు, వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కబునీ గ్లోబల్ బ్రాండ్ అంబాసడర్ సౌరవ్ గంగూలీ అన్నారు. ప్రస్తుతం క్రికెట్‌తో ప్రారంభమైన ఈ యాత్ర త్వరలో టెన్నిస్, గాల్ఫ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి మరిన్ని క్రీడలకు విస్తరించనుంది. లక్ష్యం ı క్రీడల ద్వారా పనితీరు, ఆరోగ్యం, సమాజ భాగస్వామ్యం, దైనందిన ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడమే అన్నారు. ఇప్పటివరకు ఇలాంటి స్థాయి శిక్షణ ప్రొఫెషనల్స్‌కే లభించేదన్నారు. కానీ కబునీతో అది అందరికీ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. బ్రిటన్‌కి చెందిన ప్రముఖ క్రీడా సాంకేతిక సంస్థ కబునీ భారత మార్కెట్లో అడుగుపెట్టింది. అత్యాధునిక కృత్రిమ మేధ టెక్నాలజీతో ప్రొఫెషనల్ స్థాయి క్రికెట్ కోచింగ్‌ను ప్రతి బాలుడు, ఆటగాడి చేతుల్లోకి తీసుకురావడమే కబునీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా కబునీ సహ వ్యవస్థాపకుడు సీఎఫ్ ఓ ప్యాట్రిక్ బాడెనోచ్ మాట్లాడుతూ "వీధుల్లోనా, స్కూల్ మైదానాల్లోనా, నెట్‌ల్లోనా లేదా క్రికెట్ పిచ్‌ల్లోనా ı ఎక్కడైనా ఆటగాడు తన ఆటను రికార్డ్ చేసుకుని, వ్యక్తిగత ఫీడ్‌బ్యాక్ పొందవచ్చు. అభివృద్ధి సంతోషాన్ని ఆస్వాదించవచ్చు," అన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా క్యాంప్

విశాలాంధ్ర-హైదరాబాద్ :స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ మెగా క్యాంప్, నవంబర్ 12, 2025 (బుధవారం) న మధ్యాహ్నం 2:00 గంటల నుండి ఎస్‌బిఐ స్థానిక ప్రధాన కార్యాలయం ఆవరణలోని, మల్టీ పర్పస్‌హాల్ హైదరాబాద్ లో నిర్వహించబడుతుంది. కేంద్ర ప్రభుత్వ మరియు స్వయంప్రతిపత్త సంస్థల పెన్షనర్లు తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పణకు బ్యాంకు సిబ్బంది సహాయంతో సదుపాయం పొందవచ్చు. దయచేసి ఆధార్ కార్డ్, పిపిఒ నంబర్, ఖాతా సంఖ్య , ఆధార్‌తో రిజిస్టర్ చేసిన మొబైల్ నంబర్ తీసుకురావాలి. ప్రక్రియను సులభంగా, వేగంగా మరియు కాగిత రహితంగా చేసుక

తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అన్నదానం

విశాలాంధ్ర-జవహర్ నగర్ : తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం సామాజిక కార్యకర్త కొమ్మరాజుల వెంకటేష్ ఆర్థిక సహకారంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రెండో విడత అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అనేకమంది తమ సమస్యలను పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయానికి వస్తు పోతుంటారని అన్నారు. అటువంటి వారి కోసం తమ సంస్థ నుండి ఎంతో కొంత సహకారం అందించాలని'ప్రతి సోమవారం-అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రెండో విడత నిర్వహించామని మొదటి విడత కంటే రెండో విడతలో ఎక్కువమందికి అన్నదానం చేసామని మేం నిర్వహించే ప్రతి సోమవారం రైతు అన్నదానం కార్యక్రమానికి వివిధ వర్గాల నుండి మంచి స్పందన వస్తుందన్నారు. ఇటువంటి పుణ్య కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి సహాయం అందిస్తే మరింత ఎక్కువ మందికి తమ సంస్థ నుండి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ముఖ్యంగా ఈరోజు సంస్థ తరఫున నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కొమ్మరాజుల వెంకటేష్ ఆర్థిక సాయం అందించారని వారికి మా సంస్థ తరఫున ధన్యవాదాలు తెలిపారు . అనంతరం సంస్థ ప్రధాన కార్యదర్శి ఇంద్రపాల సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్గనైజేషన్ స్థాపించిన నాటి నుండి ఏదో ఒక సేవా కార్యక్రమం చేస్తూనే ఉంటున్నామని గతంలో కూడా అనేకమార్లు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో వద్ద నిర్వహించే ప్రతి సోమవారం రైతు- అన్నదానం కార్యక్రమానికి విరాళాలు ఇచ్చే దాతలు 9032088236 లో సంప్రదించాలన్నారు. తదనంతరం తెలంగాణ రైతు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు పంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్ అంబాల మల్లేష్ అంబాల విష్ణు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సర్వీసు యాక్ట్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర-కోదాడ : లీగల్ సర్వీసు యాక్ట్ ను కక్షిదారులు ఉపయోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ అన్నారు. నేషనల్ లీగల్ సర్వీస్ డే సందర్భంగా సోమవారం కోదాడ కోర్టులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 1987లో ఏర్పడిన లీగల్ సర్వీస్ చట్టం 1995 నుంచి అమలులోకి వచ్చిందన్నారు.లీగల్ సర్వీస్ యాక్ట్ ద్వారా అందరికి సమ న్యాయం అందించడానికి,పేదలకు న్యాయాన్ని చేరువ చేయడానికి కృషి జరిగిందన్నారు.ఈ చట్టం ద్వారా అందరికీ న్యాయ విజ్ఞానం అందిస్తున్నామని, రాజీమార్గాలను, లోక్‌అదాలత్‌లను, మధ్యవర్తిత్వం, న్యాయ సహాయం అందించడం,పలు రకాల కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయి నుండి మండల స్థాయి వరకు లీగల్ సర్వీస్ కమిటీలు ఏర్పాటు చేసి కార్యక్రమాలను చేస్తున్నామన్నారు.చిన్న చిన్న నేరాలల్లో జైలులలో మగ్గుతున్న ఖైదీలకు, దారిద్ర్య రేఖకు దిగువన గల పేదలకు న్యాయ రక్షణకు కల్పించడంలో న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఈ చట్టం అమలు జరుగుతూ అందరికీ న్యాయం అందేలా చేస్తున్నామన్నారు.బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య,మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉమర్,రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జకీయా సుల్తానా, సెంకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సత్యనారాయణ,సీనియర్ న్యాయ వాదులు గట్ల నర్సింహారావు,ఈదుల కృష్ణయ్య, సిలివేరు వెంకటేశ్వర్లు,బార్ అసోసియేషన్ సభ్యులు హుస్సేన్, నవీన్,చలం,దొడ్డ శ్రీధర్, వెంకటేశ్వర్లు, లీగల్ సర్వీస్ సిబ్బంది మౌనిక, శైలజ,పారాలీగల్ వాలంటీర్లు,అంగన్ వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

కష్టపడి పండించిన పంటను దళారులకు అప్పగించొద్దు

విశాలాంధ్ర బ్యూరో,సంగారెడ్డి : ప్రతి రైతు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని,కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అప్పగించొద్దని టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సోమవారం కంది, సంగారెడ్డి మండలాలలో వనకాలం వడ్ల కొనుగోలు కేంద్రాలను టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వడ్లకు మద్దతు ధర ఇస్తుందని,ఏ గ్రేడ్ 2389, సాధారణ రకం గ్రేడ్ 2369, సన్నవడ్లకు 2389 బోనస్ 500, మొత్తం 2889 గా ఇస్తుంది, ప్రతి ఒక్క రైతు వడ్ల కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని వారు అన్నారు,బోనస్ కు కావలసిన పత్రాలు, కొత్త పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ బుక్, ఆధార్ కార్డ్ ఉండాలని సూచించారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్,ప్రభాకర్ రెడ్డి,తాళ్లపల్లి మాజీ సర్పంచ్ ప్రవీణ్ కుమార్,మాజీ ఉపసర్పంచ్ హషం, లక్ష్మారెడ్డి, ప్రభుత్వ అధికారులతో పాటు, రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గురజాల వారి కోర్టులో
E.P. No. 05 / 2025 in O.S. No. 12 / 2020
బిట్వీన్ :
మట్టా పూర్ణిమ ....పిటీషనర్/ వాది(D.Hr).
Vs
మట్టా కవిత మరియు 3 ఇతరులు
....రెస్పాండెంట్స్ (J.Dr)
To:
మట్టా స్రుజన@చిట్టి (J.Dr No.2),D/o. లేటు సైదయ్య, వయస్సు.25సం॥లు, R/o.D/o.4-11-439/1, Flat No. 405, SS ప్రైడ్ విల్లా అపార్ట్‌మెంట్, హైదరాబాద్‌రోడ్, సబ్.స్టేషన్ ఎదురు, చైతన్యపురి కాలని, నల్లగొండ టౌను & జిల్లా. T.S.
పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్‌నై యున్నాను. పై నెంబరు కేసుకి సంబందించి శ్రీముఖులు ఎన్నిసార్లు మీకు నోటీసులు పంపించినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొని ఉండలేదు. కావున శ్రీ కోర్టువారు సదరు పిటీషనుకు సంబంధించిన వాయిదా ది.19-11-2025వ తేది వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం మీరు గాని లేక మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీకు పరోక్షంగా తీర్మానించబడును. వాయిదా తేది 19-11-2025
శ్రీ కోట శ్రీనివాసరావు,
అడ్వకేట్, గురజాల. సెల్ : 9866469668

సింగరేణి పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి సంస్థ పరిరక్షణకు జాప్యం చేయకుండా యాజమాన్యం పటిష్టమైన చర్యలు చేపట్టి కోల్ బెల్ట్ ప్రాంతాల అభివృద్ధికి కృషిచేయాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ ను కోరారు. సోమవారం సంస్థ సింగరేణి భవన్ లో అయన స్ట్రక్చరల్ సమావేశం సందర్భంగా మూడు గంటలపాటు చర్చలు జరిపారు. గుర్తింపు సంఘం నాయకులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కోల్ బెల్ట్ ప్రాంతాల్లో విస్తారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయన్నారు. ఈ సంపద రాష్ట్రాభివృద్ధికి, ఉద్యోగ ఉపాధి కల్పన ఎంతో తోడ్పడుతుం దన్నారు. నూతన గనులు ఏర్పాటుచేయడం ద్వారా బొగ్గువెలికితీసి ఈ ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలన్నారు. స్వరాష్ట్రం తెలంగాణ తెచ్చుకున్నది స్థానిక సంపదలు ఇక్కడి ప్రజలకే భాగస్వామ్యం లభించాలని ఉద్దేశం అన్నారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో సంస్థ ఆధ్వర్యంలో థర్మల్ పవర్ ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన అన్నిరకాల వనరులున్నాయని వివరించారు. సంస్థలో పనిచేసి పదవి విరమణపొందిన సుమారు 10 వేల మందికిపైగా మాజీ కార్మికులు కేవలం రూ 1000 మాత్రమే ఇవ్వడం తగదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తాను తీసుకెళ్లానని ప్రభుత్వం నుంచి కూడా సానుకూల స్పందన లభించిందన్నారు. సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో, ఏరియా ఆస్పత్రుల్లో గుండె సంబంధిత కార్మిక రోగుల కాట్లాగ్ ఏర్పాటు చేసి అందుకు సంబందించిన మెరుగైన వైద్యం అందించాలన్నారు.

అంగీకారం తెలిపిన డిమాండ్స్ : గుర్తింపు సంఘం నేతలు

ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు కూనంనేని సారథ్యంలో తాము ప్రస్తావించిన డిమాండ్లను యాజమాన్యం అంగీకరించిందని గుర్తింపు సంఘం అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య కొరిమి రాజ్ కుమార్‌లు వెల్లడించారు. యాజమాన్యం అంగీకారం తెలిపిన పరిష్కారాలు ఇలా ఉన్నాయి. 150 మస్టర్ల గైరహాజరు సర్క్యులర్ రద్దుచేసి పాత విధానాన్నే యాజమాన్యం అమలు చేస్తుంది. సొంత ఇంటి పథకాన్ని అమలు చేసేందుకు ప్రణాళిక షురూ చేస్తుంది. హైదరాబాదులో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లు యాజమాన్యం తెలిపింది. త్వరలోనే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభిస్తారు. బదిలీ వర్కర్లుగా అపాయింట్మెంట్ అవుతున్న ఉద్యోగులందరూ ఇకనుంచి జనరల్ అసిస్టెంట్ ట్రేనిగా నియమించబడతారు. అదేవిధంగా పెరిక్స్ (అలవెన్స్) లపై పడే ఇన్కమ్ టాక్స్ ను యాజమాన్యమే భరించాలనే విషయాన్ని ప్రభుత్వ అనుమతి తీసుకుని పరిష్కరిస్తారు. మెడికల్ బోర్డును యధాతథంగా కొనసాగించుటకు నిర్ణయ తీసుకున్నారు. మారుపేర్ల ఉద్యోగ, కార్మికుల విషయమై ఒక్కొక్క కేసును విడివిడిగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. పర్సనల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు 9 మందికి రిక్రూట్మెంట్ ద్వారా ఆఫీసర్ క్యాడర్ ఈ - 1 గ్రేడ్ ఇచ్చేందుకు అంగీకరించారు. రూ.1000 లోపు పెన్షన్ పొందుతున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ అయిన రూ. 2016 రూపాయలను ఇప్పించుటకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో సీఎండీ బాలరామ్ తోపాటు డైరెక్టర్ పా గౌతమ్ పొట్రు, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, తిరుమల్ రావు, సంబంధిత జనరల్ మేనేజర్లు, గుర్తింపు సంఘం అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు కే సారయ్య , కే వీరభద్రయ్య, వై వి రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శులు అక్బర్ అలీ వంగ వెంకట్ పాల్గొన్నారు.

సీపీఆర్ఎంఎస్ కార్డుదారులకు క్యాంపెయిన్

విశాలాంధ్ర - మణుగూరు : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అన్ని సంస్థల పెన్షనర్లలో డిజిటల్ సాధికారత పెంపు కోసం నిర్వహిస్తున్న డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0 సోమవారం మణుగూరు ఏరియా నిర్వహించారు. కమ్యూనిటీ హాల్, పి.వి.కాలనీ నందు, బొగ్గు గనుల భవిష్యనిధి సంస్థలు సిఎంపిఎఫ్ పెన్షన్ పొందువారితోపాటు సిపిఆర్ఎంఎస్ కార్డులు గల మాజీ ఉద్యోగులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పణ విధానంపై అవగాహన కల్పించారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఏరియా ఎస్ఓ టు జిఎం బి. శ్రీనివాస చారి, డిజిఎం, ఎస్.రమేష్ , సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ వంశీధర్ కుసుంభ, ఎం. కనకమ్మ పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న పెన్షనర్లు ప్రతి నవంబర్ నెలలో సమర్పించాల్సిన లైఫ్ సర్టిఫికేట్ ను ఇకపై బ్యాంకులకు వెళ్లకుండా తమ ఇంటి వద్ద నుండే మొబైల్ ద్వారా సౌకర్యం కల్పించబడిందన్నారు. పేర్కొన్నారు. ప్లే స్టోర్ లో జీవన్ ప్రమాన్ ఫర్ లైఫ్ సర్టిఫికెట్ " ఆధార్ ఫేస్ ఆర్.డి" మొబైల్ యాప్ల ద్వారా సులభంగా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించవచ్చన్నారు. ఈ సందర్భంగా వీడియో ద్వారా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మందికి పైగా పెన్షనర్లు, కార్డుదారులు పాల్గొని తమ లైఫ్ సర్టిఫికేట్ లను సమర్పించారు.

గంజాయి ప్రాంతాలు తనిఖీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : గంజాయి సరఫరా అమ్మకాల కేంద్రాలను గమనించి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. సోమవారం ఆయన పాల్వంచ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి అనేక సూచనలు చేశారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, సీఐ సతీష్, ఎస్సైలు సుమన్, జీవన్ కుమార్, కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : గురుకులాలతోపాటు వివిధ రాష్ట్రాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం జూలూరుపాడు లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్శనలో ఆయన విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడి, వారితోపాటు భోజనం చేసారు. విద్యా స్థాయి, వసతి, భోజనం, రోజువారీ జీవన విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలోని తరగతి గదులు, భోజనశాల, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. ప్రత్యేకంగా క వంటగదిలో వంట కోసం ఉపయోగించే సామాగ్రిని, వంట పాత్రలను, పదార్థాల నిల్వ పద్ధతులను, ఆహార తయారీ సమయంలో పాటిస్తున్న పరిశుభ్రతా ప్రమాణాలను వివరంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థినులతో ప్రశ్నలు అడిగి వారి విద్యా ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. క్రమశిక్షణ, శ్రద్ధ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను సాధించాలని కలెక్టర్ కోరారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ పిఎస్‌లో ఏసీపీ రమణమూర్తి తనిఖీ

విశాలాంధ్ర ఖమ్మం (క్రైమ్) : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి సందర్శించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఏసీపీ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు,. సిసిటి ఎన్ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్‌లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల భాధ్యతలు విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

తలవంచని వాగ్గేయకారుడు అందెశ్రీ

విశాలాంధ్ర ఖమ్మం : రాజ్యానికి తలవంచని వాక్యకారుడు అందెశ్రీ అని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఆయన అకాల మరణం కవి రచయితల లోకానికి గాక ప్రజా ఉద్యమాలకు కూడా తీరని లోటని ఆయన అన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ పక్షాన అందెశ్రీ మృతికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన రాసిన 'మాయమైపోతున్నడమ్మా మనిషన్న వాడు'..అనే పాట నేటి ప్రపంచీకరణ చేసిన మానవ విధ్వంసాన్ని పాటరూపంలో ఆవిష్కరించింది. గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన జైజై తెలంగాణ అనే గీతం తెలంగాణ రాష్ట్ర గీతంగా మారిన విషయాన్ని గుర్తు చేశారు తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా జ్ఞాపకం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి వి మనోహర్రాజు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివలింగం ఆవుల అశోక్ సి.వైపులయ్య జి రామయ్య కె అర్జున్ రావు సిహెచ్చిరోమణి ఝాన్సీ నాగేశ్వరరావు పి శోభ శిరీష హనుమంతరావు లాల్మియా శరత్ లక్ష్మణ్ కే శ్రీను ఆజాద్ రాకేష్ వెంకటేష్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



అందెశ్రీకి కాంగ్రెస్ నేతల నివాళి

విశాలాంధ్ర - అశ్వాపురం : జన కవి తెలంగాణ ఉద్యమకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత అందెశ్రీ అకాల మరణం బాధించిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని గొల్లగూడెం గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అందెశ్రీ ఫోటోకు పూలమాలవేసి, కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులర్పించారు. ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని కొద్ది నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొడియం అనిల్ కుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు భూతం వెంకన్న, నాయకులు తోట సత్యనారాయణ, బొబ్బాల నాగేశ్వరరావు, బొబ్బాల వీరన్న, కమ్మాల యాకయ్య, బొబ్బాల కృష్ణ, మర్రి నాగరాజు, బోక్సం రవికుమార్, బొబ్బాల సీతారాములు, బారి రామకృష్ణ, వీరబోయిన మల్లయ్య, రాసాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ సజావుగా సాగాలి : మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో,నల్గొండ జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ సజావుగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టర్ జిల్లా పరిస్థితులపై వివరాలు ఇచ్చారు. జిల్లాలో ఇప్పటివరకు రైతులకు రూ.160 కోట్లు చెల్లించగా, మరో రూ.70 కోట్లు చెల్లించాల్సి ఉందని ఆమె తెలిపారు. వర్షాల కారణంగా కొద్దిరోజులు సేకరణకు ఇబ్బంది కలిగినప్పటికీ ప్రస్తుతం సాఫీగా కొనసాగుతోందని, 4,600 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కూడా మిల్లర్లు కొనుగోలు చేశారని వివరించారు. పత్తి కొనుగోలుకు తేమ కొలిచే 83 యంత్రాలు అవసరమని ఆమె తెలిపారు. దీనిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే యంత్రాల కొనుగోలుకు అనుమతి ఇచ్చారు. జిల్లాలో 23 కొనుగోలు కేంద్రాలకు గాను 15 మిల్లులు ఇప్పటికే ప్రారంభించారని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులు సమావేశమై నవంబర్ నెలలో ఎక్కువ ధాన్యం సేకరణ జరగనున్నందున సెంటర్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి పంపించాలని ఆదేశించారు.మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రారంభించని కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, రైతులకు 48 గంటల్లో చెల్లింపులు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని సేకరించేలా చర్యలు తీసుకోవాలని, పత్తి తేమ శాతం తగ్గించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడి చాయదేవి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, డిఎస్ఓ వెంకటేష్, వ్యవసాయ అధికారి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శివాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా నిర్వహించిన మహా అన్నప్రసాద కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి (గురుస్వామి) ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయాన్ని దర్శించుకుని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాసరావు, లక్ష్మణ్, రమణ, రామచంద్రనాయక్, బాలకృష్ణ,దాని నాయుడు,రాజు,రాజు గౌడ్, ఈశ్వర్‌రావు, రామకృష్ణ,శివ నాగరాజు యాదవ్, సుమతి, జయలక్ష్మి, జ్యోతి, లక్ష్మి, శైలజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మ్యాజిక్ ఆఫ్ సినిమా'

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : సాధన ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ యొక్క ప్రతిష్టాత్మక వార్షికోత్సవ వేడుకలు ఈ సంవత్సరం 'మ్యాజిక్ ఆఫ్ సినిమా' (సినిమా మాయాజాలం) అనే వినూత్న థీమ్‌తో అంగరంగ వైభవంగా నిర్వహించ బడ్డాయి. విద్యార్థుల సృజనాత్మకత, ప్రతిభ ప్రదర్శన కళలపై వారికున్న ఆసక్తిని ప్రదర్శించేందుకు ఈ వేడుక ఒక అద్భుతమైన వేదికగా నిలిచిందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రితి రాజ్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసన రితిరాజ్ జ్యోతి ప్రజ్వలన వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. పాఠశాల చైర్మన్ సునంద్ సురపనేని, చైర్ పర్సన్ పద్మప్రియ సురపనేని, మేనేజింగ్ డైరెక్టర్ కుమారి సాధనాదేవి సురపనేని, ఆపరేషన్స్ డైరెక్టర్ జి. మురళీమోహన్, సి బి ఎస్ ఈ ప్రిన్సిపాల్ శోభ్నా శిరోహి, సి ఐ ఈ ప్రిన్సిపాల్ సరితా కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి లత, అకాడమిక్ హెడ్ శిరీష కొల్లి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, పాఠశాల వార్షిక నివేదికను వెల్లడించి చదువు, క్రీడలు, సాంస్కృతిక రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

వనసమారాధన

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : కార్తీక మాసంలో కుటుంబ సభ్యులతో వన భోజనాలు చేయడం అనాదిగా వస్తోందని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా అన్నారు. అగర్వాల్ సమాజ్ మహారాజా అగ్రసేన్ మార్గ్ శాఖ దివాళీ మిలన్, అన్నకూట్ ప్రసాద్ కార్యక్రమం నిర్వహించారు. ప్రచార ప్రసార కన్వీనర్ ముకుంద్‌లాల్ అగర్వాల్ ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. బంజారా హిల్స్‌లోని గోల్డెన్ టెంపుల్, స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం రఘునాథ్ మల్ నరేంద్ర కుమార్ సభాగృహంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా, ఉపాధ్యక్షులు రూపేష్ కుమార్ అగర్వాల్, గౌరవ మంత్రి వికాస్ కుమార్ కేషన్, సహ మంత్రి శ్రీమతి సీమా జైన్, కోశాధికారి అచల్ గుప్తా, సలహాదారులు బద్రీవిశాల్ బన్సల్, చంద్రకాంత్ అగర్వాల్, మాజీ రాజ్యసభ సభ్యులు గిరీష్ కుమార్ సంఘీ, ఐ.ఎ.ఎస్ అధికారి సతీష్ చంద్ అగర్వాల్, రిటైర్డ్ ఐ.ఎ.ఎస్ అధికారి వినోద్ అగర్వాల్, అగ్రసేన్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు గోపాల్ చంద్ అగర్వాల్, చైర్మన్ నరేంద్ర కుమార్ గోయల్, సహమంత్రి మనోజ్ కుమార్ అగర్వాల్, కోశాధికారి బజరంగ్ ప్రసాద్ గుప్తా, శ్రీ కృష్ణ గోసేవా మండల్ ఉపాధ్యక్షులు బజరంగ్ లాల్ శర్మ, అఖిల భారతీయ వైశ్య సమ్మేళన్ మంత్రి గోపాల్ మోర్, మహేష్ బ్యాంక్ చైర్మన్ రమేష్ కుమార్ బంగ్, వైస్ చైర్మన్ సి.ఎ. మురళీ మనోహర్ పలోడ్, బ్యాంక్ ఇతర డైరెక్టర్లు గోవింద్ నారాయణ్ రాఠీ, దేవేంద్ర ఝువార్ తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర , కాప్రా : మల్లికార్జున స్వామి, అభయాంజనేయ స్వామి, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి,నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి నాయకులు రుద్రగోని రాంచందర్ గౌడ్, మహేష్ గౌడ్, మల్లేష్ వంశరాజ్, మల్లేష్ యాదవ్, కౌకుట్ల అనంత్ రెడ్డి, రాహుల్ రెడ్డి, రాగీరు సత్యనారాయణ గౌడ్, నాథం గౌడ్, తైదల బీరప్ప, సభ్యులు కొండ జంగారెడ్డి, ఎం శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, శివ నాయక్, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రంజిత్, నరసింహ రెడ్డి, ప్రశాంత్, శ్రీ కాంత్ తదితరులు పాల్గొన్నారు

స్వార్ణా జువెల్స్ ప్రారంభం

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని మధురనగర్ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన స్వార్ణా జువెల్స్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీతో కలిసి ముఖ్య అతిథుగా పాల్గొని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి, యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన వ్యాపార రంగంలో అడుగుపెట్టిన దేవరపల్లి శ్రీనివాస్ రెడ్డి గారి వ్యాపారం అందరి మన్ననలు పొందుతూ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న వాణిజ్య అవకాశాలతో పాటు యువ పారిశ్రామికవేత్తలు కొత్త రంగాల్లో ముందుకు వస్తుండటం శుభపరిణామం అన్ని పేర్కొన్నారు.స్వార్ణా జువెల్స్ వంటి ఆధునిక ఆభరణాల షోరూమ్‌లు

సుస్థిరాభివృద్ధికి దీపస్తంభం విశాఖ

- క్లస్టర్లుగా విభజించి ప్రాజెక్టుల అభివృద్ధికి బ్లూ ప్రింట్
- వీఈఆర్‌కు అవసరమైన పాలసీల రూపకల్పన
- ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న విశాఖ ఆర్థిక ప్రాంత అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం అవసరమైన పాలసీలు రూపొందించాలని సూచనలు జారీ చేశారు. సచివాలయంలో సోమవారం జరిగిన విశాఖ ఎకనామిక్ రీజియన్(వీఈఆర్) అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించారు. సీఎస్ విజయానంద్, ఆర్థిక, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, పర్యాటక, ఐటీ, మున్సిపల్, పరిశ్రమలు, వ్యవసాయ, ప్రణాళికా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీఈఆర్‌ను రాష్ట్రానికి గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దే అంశంపై ముఖ్యమంత్రి వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న వివిధ జిల్లాలను విశాఖ ఎకనామిక్ రీజియన్‌గా అభివృద్ధి చేసే విషయంలో స్థానికంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, ప్రజల జీవన ప్రమాణాలు, సుస్థిరాభివృద్ధి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని...ఓ బృహత్తర ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. మొత్తం ఏడు అంశాల ఆధారంగా వీఈఆర్ గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా మారుతుందని సీఎం వ్యాఖ్యానించారు. పోర్టుల ద్వారా కార్గో హ్యాండ్లింగ్‌తో పెద్దఎత్తున లావాదేవీలు జరగాల్సి ఉందని అన్నారు. శ్రీకాకుళం మూలపేట పోర్టు నుంచి రీజియన్‌లోని కాకినాడ పోర్టు వరకూ హింటర్ ల్యాండ్‌లోని చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ లాంటి ప్రాంతాలకు చెందిన కార్గో రవాణా జరిగేలా చూడాలని, మూలపేట పోర్టు నుంచి దుగరాజపట్నం పోర్టు వరకూ షిప్ బిల్డింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యేలా చర్యలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర దక్షిణాది రాష్ట్రాలను కలుపుతున్న ఏపీ ఇక ఈస్ట్ వెస్ట్ కారిడార్‌గానూ మారాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 12-15 మాన్యుఫ్యాక్చరింగ్ నోడ్స్ కలిగిన ప్రాంతంగా విశాఖ ఎకనామిక్ రీజియన్ మారుతుందని అన్నారు. ప్రత్యేకించి ఈ రీజియన్‌లో క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్నారు. విశాఖ లాంటి ప్రాంతాలు నెక్స్ జెన్ ఐటీ డేటా సెంటర్, ఏఐ ఇన్నోవేషన్ మారుతున్నాయని, ఈ రీజియన్‌లోని ఇతర ప్రాంతాలు జాతీయ, అంతర్జాతీయ హెల్త్‌కేర్ హబ్‌గా మార్చాల్సి ఉందన్నారు. ప్రణాళికాబద్ధంగా పట్టణీకరణ-గృహనిర్మాణ ప్రాజెక్టులు రావాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్లమ్ క్లస్టర్ రీడెవలప్‌మెంట్ కోసం ప్రత్యేక విధానం తీసుకురావాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాంతంలో 100 నుంచి 115 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చేందుకు ఆస్కారం ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రకటించిన వివిధ ప్రాజెక్టుల ద్వారా 15 బిలియన్ డాలర్లు, ప్రైవేటు కార్పోరేట్లు, సంస్థల ద్వారా 85 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్టు సీఎం తెలిపారు. ఈ ప్రాంతంలోని పోర్టులను రైల్వే లైన్లతో అనుసంధానం చేయనున్నట్టు వెల్లడించారు. త్వరలోనే ఈ మార్గంలో రైల్వేమార్గాలు నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్రం ప్రణాళికలు చేస్తోందని అన్నారు. ఆరోగ్య పరిరక్షణ పాలసీతో మెడికల్ టూరిజాన్ని అనుసంధానం చేయాలని సూచనలు చేశారు. ఇదేతరహాలో వివిధ పాలసీలను ఆయా ప్రాజెక్టులకు అనుసంధానించాలన్నారు. మరోవైపు సీఎం అధ్యక్షతన విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రికి అధికారులు ప్రతిపాదించారు. దీనిపై స్పందించిన సీఎం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

నూతన అక్రిడిటేషన్ల మీడియా రిలేషన్స్ పోర్టల్

ప్రారంభించిన మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర- సచివా లయం: అర్హత కలిగిన జర్నలిస్టుల అక్రిడిటేషన్‌ల జారీ కోసం మీడియా రిలేషన్స్ పోర్టల్‌ను సమా చార, పౌర సంబం ధాల శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ఏపీ సచివాల యంలోని ప్రచార విభాగంలో ప్రారంభించారు. అర్హులయిన జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు తమ దరఖాస్తు స్థితి ఏ దశలో ఉందో కూడా ఈ సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతం

- ప్రపంచంలోనే అమూల్, ఇఫ్‌కో అగ్రస్థానం
- ప్రతి పట్టణంలో ఒక అర్బన్ బ్యాంక్
- 'అంతర్జాతీయ కో-ఆపరేటివ్' సదస్సులో అమిత్‌షా

న్యూదిల్లీ: సహకార రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా సమాజంలో ఉన్న బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్ప డాలని కేంద్ర సహకార శాఖ, హోంమంత్రి అమిత్ షా అన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్, క్రెడిట్ సొసైటీస్ (నాఫికాల్) అధ్వర్యంలో న్యూదిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రెండురోజుల పాటు జరిగే అంతర్జాతీయ అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సెక్టార్ సదస్సును సోమవారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. దేశ, విదేశాల నుంచి 1350 మంది సహకార వ్యవస్థ విధాన నిర్ణయకర్తలు, నియంత్రణ సంస్థల ప్రతినిధులు, సహకార సంస్థ చైర్మన్లు, డైరెక్టర్లు, సాంకేతిక నిపుణులు హాజర య్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అమిత్ షా మాట్లాడుతూ సమాజంలో సామాన్యులకు విశేష సేవలు అందిస్తున్న సహకార వ్యవస్థను పౌర సమాజం పటిష్టం చేయాలన్నారు. ప్రపంచంలో భారతదేశ సహకార సంస్థలు అమూల్, ఇఫ్‌కో అగ్రస్థానాల్ని ఆక్రమించాయని, వాటి స్ఫూర్తితో సహకార సంస్థల సేవలను విస్తృతం చేయాలన్నారు. తన చిన్నతనం నుంచి పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థ 'అమూల్' విస్తరణలో వస్తున్న మార్పులను గమనిస్తున్నానన్నారు. పాల ఉత్పత్తి రంగంలో విప్లవాత్మక మార్పుల ద్వారా అమూల్ లక్షల మంది రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచిందన్నారు. శ్వేతవిప్లవం ద్వారా 36 లక్షల మంది రైతులు 18 వేల గ్రామ కమిటీలతో 18 జిల్లాస్థాయి సంఘాలతో అమూల్ ప్రస్తుతం రోజుకు 3 కోట్ల లక్షల లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇలాంటి సంస్థల విజయాల స్ఫూర్తితో సహకార సేవలను మరింతమంది ప్రజలకు చేకూర్చేందుకు రాబోయే ఐదేళ్లలో 2 లక్షల జనాభా పైబడిన ప్రతి పట్టణంలో ఒక అర్బన్ బ్యాంకును నెలకొల్పాలన్నారు. యువతను సహకార రంగంలోకి తీసుకురావడం ద్వారా ఈ రంగానికి కావల్సిన నిపుణులను తయారుచేయవచ్చన్నారు. 2047 నాటికి మలితరం సహకార రంగాన్ని ఉన్నత శిఖరాలను చేర్చవచ్చని అమిత్ షా ఆకాంక్షించారు. ఈ దిశగా సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి అనువైన మోడల్ బైలాన్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, వాటిని పశ్చిమబెంగాల్ రాష్ట్రంతో సహా అన్ని రాష్ట్రాలు మద్దతు ప్రకటించాయన్నారు. దేశంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను సైతం కంప్యూటరీకరణ చేస్తున్నామని, సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ సామాన్యులకు సహకార సేవలు అందించాలన్నారు. చలసాని రాఘవేంద్రరావు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖ బ్యాంక్ చైర్మన్ జేవీ సత్యనారాయణమూర్తి, గుంటూరు అర్బక్ బ్యాంక్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, వాణి బ్యాంక్ చైర్మన్ వెంకరత్నం, మహారాజ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎంఆర్‌కే రాజు, ఇన్నిస్‌పేట అర్బన్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు, జామ్‌పేట బ్యాంక్ డైరెక్టర్ లక్ష్మణరావు, హిందుస్థాన్ షిప్ యార్డ్ కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్ సొసైటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, విశాఖ బ్యాంక్ డైరెక్టర్ సీహెచ్. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పది కార్పొరేషన్లలో 122 మంది డైరెక్టర్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో మరో 10 కార్పొరేషన్లకు బోర్డు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 122 మందికి డైరెక్టర్లుగా పదవులు కేటాయించింది. కొత్తగా నియమించిన వారిలో కూటమి ప్రభుత్వంలో భాగమైన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు ఉన్నారు. కొత్తగా డైరెక్టర్లుగా నియామకమైన వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డులో జనసేకు చెందిన బందారు రవికాంత్, నల్లే వీర ప్రసన్నకుమార్, బీజేపీకి చెందిన నీలపు విజయానందరెడ్డి, టీడీపీకి చెందిన భూలక్ష్మి అంబటి, భూమే వెంకట నారాయణ, డా.చిన్నరాజు గుడిపూడి, జగన్నాథరావు రాపర్ల, కౌశిక్ వాయుగండ్ల, మురళీమోహన్, ప్రదాన విజయరామ్, రాజారావు ముగడ, రావిళ్ళ వీరేందర్ కుమార్, వి.వి. సత్యనారాయణమూర్తి పోతుల నియమితులయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్‌లో ఆదినారాయణ ముక్కు, బాబు శ్రీపతి, భిక్షం మేకల, రాచపూడి సురేష్, జనసేనకు చెందిన పాకనాటి గౌతంరాజ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ కమిషన్‌లో బి.షఫియుల్లా, జమీర్ పటాన్, కఫీల్ బాషా షేక్, ఆంధ్ర ప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డులో ఆరా మహేశ్వరి, అర్థరాజు నీలపాల, దాడెం నారపరెడ్డి, జోగులు మోసియా, లోమద చంద్రమోహన్ రెడ్డి, సాయిబాబు గదుల్ల, వెంకట రమణి ఏడుపాటి, విశ్వనాథ నాయుడు, జనసేనకు చెందిన చింతా రేణుకారాజు, నల్లగోపుల వెంకట చలపతిరావు, బీజేపీకి చెందిన పిడుగు వెంకట శివారెడ్డి నియమితులయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో జనసేనకు చెందిన చల్లా లక్ష్మీ, పసుపులేటి మురళీకృష్ణ, బీజేపీకి చెందిన టీడీ వరప్రసాద్, టీడీపీకి చెందిన చిరంజీవిర్, కొండనాయుడు రాజన, నరసింహారావు పాలూరి, పుష్పావతి సాయన, రమేష్ రత్నం, శివప్పారావు మామిడి, స్వరూప శనపాటి, వి.సత్యనారాయణమూర్తి, వి.వి.సూర్యసత్యనారాయణ గంగిశెట్టి, వాసుదేవ తోట, విన్నకోట శ్రీనివాసరావు, వీరేంద్రకుమార్ మల్లిపూడి, కళింగ కోమట/కళింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ బోర్డులో బి.శ్రీకాంత్, డి.గోవిందరావు, జె.వెంకటరావు, వి.మల్లేశ్వరరావు, కృష్ణమూర్తి, రమేష్, టి.రమేష్, రవిశంకర్ గుప్తా, ఎస్.సాయి రమేష్, టి.సంతోష్‌కుమార్, పి.సతీష్, కె.శ్రీనివాసరావు, బీజేపీకి చెందిన పి.అప్పారావు, జనసేనకు చెందిన సాయికుమార్‌లు నియమితులయ్యారు. రాష్ట్ర దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీలో ఆనంద్ చెన్నూరి, చెన్నూరి బ్రహ్మయ్య, జి.బంగారునాయుడు, కోల లోకయ్య, కె.సురేష్, ఎం.గిరిబాబు, మనబోతుల శ్రీరామ, పి.రామకృష్ణ, పి.గోవిందరావు, సుబ్బయ్య, రమణాజీ, జనసేనకు చెందిన ఆనంద్‌కృష్ణ, కంచర్ల భవానీశంకర్, బీజేపీ చెందిన ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు.

అందెశ్రీ మృతి తెలుగు సమాజానికి తీరని లోటు

సంతాప సభలో వక్తలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రముఖ అభ్యుదయ కవి అందెశ్రీ మరణం తెలుగు సమాజానికి తీరని లోటు అని వక్తలు అన్నారు. విజ్ఞాన్స్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం అందెశ్రీ సంతాపసభ జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఏఎన్‌యూ మాజీ తెలుగు ఆచార్యులు జి.కృపాచారి, విజ్ఞాన్స్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి అందెశ్రీకి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. మాయమైపోతున్నాడమ్మా అనే గీతంతో ప్రజలను ఆలోచింప చేశారని, జయ జయహే తెలంగాణ అనే గీతాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గీతంగా గుర్తించిందని కొనియాడారు. అందెశ్రీ 2006లో నంది పురస్కారం, 2014లో గౌరవ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, లోక్ నాయక్ పురస్కారాలను అందుకున్న మహనీయుడని పేర్కొన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గిరిజన హక్కులు నిర్వీర్యం

- ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లింపు
- మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ విమర్శ
- విజయవాడలో గిరిపుత్రుల భారీ ర్యాలీ

విశాలాంధ్ర-విజయవాడ: పాలకుల అనాలోచిత నిర్ణయాలతో తమ జీవితాలు తీవ్రంగా నష్టపోతున్నామని గిరిజనులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన హక్కులను సైతం నిర్వీర్యం చేసే కార్యక్రమాలు జరగడంతో మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నామని కన్నీళ్లు పెట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఏళ్ల సంవత్సరాలుగా అణిచివేతకు గురవుతున్న గిరిజనుల అభివృద్ధి పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం దురదృష్టకరమని, గిరిజనుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సైతం పక్కదారి పట్టించి గిరిజనేతర కార్యక్రమాలకు వినియో గించుకునే స్థితికి ప్రభుత్వాలు రావడం అత్యంత బాధాకరమని ఆవేదన చెందుతున్నారు. సామాజికంగా అన్ని రంగాల్లో నష్టపోతున్న తమకు న్యాయం చేయాలని గిరిజనులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య అధ్వర్యంలో సోమవారం విజయవాడలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ పీబీ సిద్ధార్థ కళాశాల వద్ద గల బుద్ధుని విగ్రహం నుండి గిరిజన శాఖ డైరెక్టర్ కార్యాలయం వరకు పెద్దఎత్తున నినాదాలతో సాగింది. వినతిపత్రాన్ని అందజేసేందుకు డైరెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ముందు నిరసనకారులు బైఠాయించి తమ హక్కులు కాపాడాలని, సమస్యలు పరిష్కరించాలని పెద్దఎత్తున నినాదాలు చేపట్టారు. పరిస్థితి అదుపు తప్పే అవకాశం ఉందని తెలుసుకున్న పోలీసులు భారీగా మోహరించి... ఆందోళనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. శాంతియుతంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఏళ్ల తరబడి జరుగుతున్న పోరాటాలు, ఎస్ఆర్ శంకరన్ కల్పించిన అటవీ హక్కులను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా గిరిజనుల అభివృద్ధికి సక్రమంగా వినియోగించాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసుల మేరకు అన్ని రకాల అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలని, పోడు వ్యవసాయం చేస్తున్న ప్రతి గిరిజనుడికి పట్టాలు పంపిణీ చేసి... వారికి భరోసా కల్పించాలని కోరారు. అటవీ హక్కుల చట్టం పటిష్టంగా అమలు చేసి... గిరిజనుల బతుకులు మార్చాలన్నారు. గురుకుల పాఠశాలలు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్న పరిస్థితి నెలకొందని, గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల పూర్తిస్థాయిలో శ్రద్ధ వహించాలని కోరారు. గిరిజనులు అనారోగ్యానికి గురైతే సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రవాణా వ్యవస్థ సరిగా లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం డోలీలపై ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఇంకా కొనసాగుతోందని ఆవేదన వెలిబుచ్చారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్ వ్యవస్థను మెరుగుపర్చాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి...నైపుణ్యం గల వైద్యులను నియమించాలని జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. గిరిజనుల నివాస ప్రాంతాల్లో విద్యా, వైద్య సౌకర్యాలతో పాటు అన్ని రకాల మందులు ఉచితంగా అందించాలన్నారు. గతంలో ఏదైనా విపత్కర పరిస్థితులు ఎదురైతే పోలీసుల పాత్ర చాలా కీలకంగా ఉండేదని, నేడు ఆ పరిస్థితి లేకపోవడం దురదృష్టకరమన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని, గిరిజనుల సంరక్షణకు అవి దోహదపడాలన్నారు. గిరిజనులు పండించే పంటలు, ఉత్పత్తులను ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి... వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా కృషి చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సక్రమంగా అమలు చేసి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ డైరెక్టర్‌కు గిరిజనుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతానని ఏడీ హామీ ఇచ్చారు. నిరసనలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య, గౌరవ అధ్యక్షుడు మన్మథరావు, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కార్యదర్శి కేవీస్ నాగరాజు నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మోటా రాముడు, సమాఖ్య నాయకులు శ్రీను నాయక్, కృష్ణా నాయక్, జి.రవీంద్రతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేదెప్పుడు?

- వైద్య కళాశాలల పీపీపీ విధానం రద్దు చేయాలి
- రూ.6,400 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి
- వలరాజు, నాసర్ జీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, జీఓ నంబరు 108, 77 లను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.వలరాజు, బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి హిందూపురం బస్సు జాతా సోమవారం కర్నూలుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ కార్యాలయం నుంచి కలెక్టరేట్ సమీపంలోని విజయ డెయిరీ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న అధ్యక్షతన విజయ డెయిరీ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద విద్యార్థుల కష్టాలు తీరుస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే నెల రోజుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చి దాదాపు ఒకటిన్నర సంవత్సరం ప్రభుత్వ పరిపాలన పూర్తవుతున్నా నిధులు విడుదల చేయలేదని అన్నారు. ఫలితంగా ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థులు సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 4,111 పాఠశాలలు మూసివేశారని 3,63,000 మంది విద్యార్థులు విద్యకు దూరం అయ్యారని, ఏ ఒక్క పాఠశాలను తెరిపించలేదన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసిందంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గగ్గోలు పెట్టిన లోకేశ్, చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య కళాశాలలను 100 శాతం ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కొరవడి... సరైన ఆహారం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడ గదులు, మరుగుదొడ్లు లేవన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థులకు హాస్టళ్లలో మౌలిక వసతులు లేక మరణిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని అభివృద్ధిని పట్టించుకోవడం లేదని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి న్యాయం చేయకుండా రాష్ట్రానికి తానే ముఖ్యమంత్రి అన్నట్టు విదేశాలు తిరుగుతూ విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కర్నూలు జిల్లాలో ఉన్న రాయలసీమ క్లస్టర్, ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 12న అనంతపురంలో బస్సు జాతా ముగింపు సభ నిర్వహిస్తామని, అటుతర్వాత రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాగా బస్సు జాతా సందర్భంగా ప్రదర్శనగా వస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులకు ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనివాసులు, శ్రీరాములు, నాయకులు పూలమాలలు వేసి స్వాగతాలు పలికి సంఘీభావం తెలిపారు. వామపక్ష విద్యార్థి నాయకులు భాస్కర్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణి సంఘీభావం తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాకారులు నృత్యాలతో, విప్లవ గేయాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి ఎస్.లెనిన్ బాబు, జిల్లా మాజీ కార్యదర్శి ఎస్.మునెప్ప, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు మస్తాన్, ఫణీంద్ర, చలపతి, నాగభూషణం, గర్ల్స్ కమిటీ సభ్యులు హరిత, రాష్ట్ర నాయకులు యశ్వంత్, మాధవ, అమర్, అభి, జిల్లా కార్యదర్శి షాబీర్ బాషా, జిల్లా ఆఫీస్ బేరర్లు శరత్ కుమార్, రంగస్వామి, థామస్, దస్తగిరి, ఈరేష్, నగర కార్యదర్శి అశోక్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, నగర కార్యదర్శి భారతి తదితరులు పాల్గొన్నారు.

కీలక నగరాల్లో విస్తృత తనిఖీలు

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో భారీ పేలుడు ఘటన నేపథ్యంలో మహారాష్ట్ర రాజధాని ముంబైతో పాటు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ఇంకా హైదరాబాద్ సహా దేశంలోని అనేక నగరాల్లో కేంద్ర హోంశాఖ హై అలర్ట్ ప్రకటించింది. ముంబైలోని కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. అదేవిధంగా యూపీలోని అన్ని జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. సున్నిత ప్రాంతాల్లో గస్తీ, తనిఖీలను పెంచాలని లక్నో నుంచి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమై పాతబస్తీలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని అన్ని మతపరమైన ప్రదేశాలు, సరిహద్దు ప్రాంతాల్లోనూ భద్రత పెంచాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆ రాష్ట్ర డీజీపీ తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో గస్తీ, తనిఖీలు పెంచాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దేశంలో భారీ ఉగ్రకుట్రలు భగ్నమవుతున్న వేళ దిల్లీలో పేలుడు ఘటన ఇప్పటికే దిల్లీ సమీపంలోని ఫరీదాబాద్‌లో దాదాపు మూడు వేల కిలోల పేలుడు తయారీ పదార్థాలను జమ్మూకశ్మీర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్‌తో సంప్రదింపులు జరుపుతున్న ముగ్గురు డాక్టర్లను అరెస్టు చేశారు. అటు గుజరాత్‌లో ముగ్గురు ఐసిస్ సానుభూతిపరులు అరెస్టైన వేళ ఈ పేలుళ్లపై అనుమానాలు బలపడుతున్నాయి.

అందరం చచ్చిపోతామనుకున్నాం

న్యూదిల్లీ: దిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై ప్రత్యక్ష సాక్షులు తమ భయానక అనుభవాల్ని వెల్లడించారు. 'నా జీవితంలో ఇంత పెద్ద శబ్దం ఎప్పుడూ వినలేదు. ఆ పేలుడు ధాటికి మూడుసార్లు కింద పడిపోయాను. ఇక అందరం చచ్చిపోతామనే అనిపించింది' అంటూ దిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన భీకర పేలుడు ఘటనను ఓ స్థానిక దుకాణదారుడు వణికిపోతూ వివరించారు. "మా ఇంటి డాబా పైనుంచి చూస్తుండగా ఒక పెద్ద అగ్నిగోళం కనిపించింది. ఆ తర్వాత చెవులు చిల్లులు పడేంత శబ్దం వచ్చింది. మా భవనాల కిటికీలు కూడా కంపించాయి" అని మరో ప్రత్యక్ష సాక్షి తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.